నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 1-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:79 పేజీలు:68 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

భారత భిన్నత్వంబును
తీరుగ మదిలోన నిలిపి తేజోమయుడౌ
భారత ప్రధాని మోడీ
"భారత పర్వము"ను నేడు ప్రారంభించెన్ !!

-రాధశ్రీ
సెల్:9494481210

)భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటడానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ ఏక్తా నగర్ లో "భారత పర్వం"ప్రారంభించారు)

చురక

కృత్రిమ మేధతోని
కూలుతున్న కొలువులు
సాఫ్ట్‌వేర్ రంగంలో
సంక్షోభపు నెలువులు.
మనిషి సృష్టి ఏఐ
మనిషిపైనే దాడి
కార్పోరేట్ల లాభాలకు
కట్టుతుంది జోడి

-వేల్పుల నారాయణ
9440433475

నవంబర్ 2న కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటన

హైదరాబాద్, అక్టోబర్ 31:కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలో నవంబర్ 2వ తేదీన పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు అమిత్ షా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి ఆయన చేరుకోనున్నారు. బేగంపేట నుంచి కాకతీయ హోటల్‌కు వెళ్లనున్నారు. 4గంటల వరకు కాకతీయ హోటల్‌లో కేంద్ర హోం మంత్రి బసచేయనున్నారు. 4గంటలకు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు నిర్వహించనున్న ర్యాలీలో అమిత్ షా పాల్గొననున్నారు.

5 గంటల నుంచి 5:30 వరకు ఎంజే మార్కెట్ వద్ద జరిగే కార్నర్ మీటింగ్‌కు అమిత్ షా హాజరుకానున్నారు. అనతరం 6గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4గంటల వరకు ఉన్న రిజర్వ్ షెడ్యూల్‌లో రాష్ట్రంలోని ప్రముఖులను కేంద్ర హోం మంత్రి కలిసే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ ముఖ్య నేతలతో కూడా అమిత్ షా భేటీ అయ్యే ఛాన్స్ ఉంది.

రాజ్యాంగ పరిరక్షణ పేరిట కాంగ్రెస్ రాజకీయ డ్రామాలు...

ఎన్నికల సంఘం, ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ చేస్తుంది అనవసర రాద్ధాంతమే...
కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ నవంబర్ 5న కరీంనగర్లో తలపెట్టిన మహా పాదయాత్రను విజయవంతం చేయండి..
.బిజెపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి..



రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 31: (నేటినిజం ప్రతినిధి): ఓటమి భయంతో అలమటిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఉనికిని చాటుకోవడానికే నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిరసన రాజకీయ డ్రామా మొదలుపెట్టిందని , రాజ్యాంగ పరిరక్షణ పేరిట , ఎన్నికల సంఘం , ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ చేస్తున్నది అనవసర రాద్ధాంతమేనని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ఘాటుగా విమర్శించారు. నంబర్ 5న కరీంనగర్లో తలపెట్టిన మహా పాదయాత్రకు సంబంధించి కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని వివిధ మండలాల మహిళా మోర్చా అధ్యక్షులు, మహిళా ప్రజా ప్రతినిధులు , ముఖ్య నేతల తో సన్నాక సమావేశం కరీంనగర్ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుర్రాల నిర్మలరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని అతిథి హోటల్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ స్వతంత్ర రాజ్యాంగ సంస్థలైన కేంద్ర ఎన్నికల సంఘం పై బురదజల్లుతూ, రాజ్యాంగం ప్రమాదంలో ఉందనే నిరాధార ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ నాయకత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా నవంబర్ 1న ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో తలపెట్టిన నిరసన కార్యక్రమం రాహుల్ గాంధీ బాధ్యతారాహిత్య వైఖరి, ఆయన రాజకీయ దురుద్దేశాన్ని స్పష్టంగా తెలియజేస్తుందన్నారు "పోలీసులకు, లాఠీలకు భయపడకండి" అంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న రాహుల్ గాంధీ ప్రజలను, కార్యకర్తలను రెచ్చగొట్టడం ఉసికొల్పేలా మాట్లాడటమే కాంగ్రెస్ స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు.బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, మేయర్ కొలగని శ్రీనివాస్ , రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, మాజీ జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ లు మాట్లాడుతూప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసే కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టను దిగజార్చేందుకు "ఓట్ల చోరీ", ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా రాజ్యాంగ వ్యవస్థల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న అపనమ్మకాన్ని మళ్లీ బయటపెట్టుకుందన్నారు. చట్టబద్ధమైన సవరణలకు, ఈవీఎం సంస్కరణలకు చట్టసభల్లో చర్చించాల్సిన విపక్షం, వీధుల్లో నిరసనలు చేస్తూ అశాంతిని సృష్టించడానికి ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. పండుగల సీజన్ కొనసాగుతున్న సమయంలో రామ్‌లీలా మైదానంలో 10 లక్షల మందితో భారీ ర్యాలీ నిర్వహించడం వల్ల పాత, కొత్త ఢిల్లీ వ్యాపారాలు దెబ్బతింటాయని, రద్దీతో కోట్లాది రూపాయల వ్యాపారం నిలిచిపోతుందని ఢిల్లీ వ్యాపార సంఘాలు సోనియా గాంధీకి లేఖ రాసినప్పటికీ కాంగ్రెస్ స్పందించకపోవడం దారుణమని, ప్రజల, వ్యాపారుల శ్రేయస్సు కంటే తమ రాజకీయ లబ్ధే ముఖ్యాంశమని కాంగ్రెస్ నిరూపించిందనే విషయం దీంతో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. దేశంలో కాంగ్రెస్ పూర్తిగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని, ఇటీవల పలు రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు చెంపపెట్టు లాంటి తీర్పు వచ్చిందన్నారు. అందుకే కాంగ్రెస్ రాజకీయ ఉనికి కోసం ప్రయత్నిస్తుందని , ఎన్నికల వ్యవస్థపై అపనమ్మకం కలిగించి ఓటమికి ముందస్తు సాకులు వెతుక్కునే ప్రయత్నం చేస్తుందని ఘాటుగా విమర్శించారు. ప్రధానంగారాహుల్ గాంధీ ఒక "అరాచక శక్తిగా" మారి దేశ ప్రతిష్టను, రాజ్యాంగ సంస్థలను దెబ్బతీస్తున్నారని, ఎన్నికల్లో గెలవలేక ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజల సమస్యలపై కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర ఎన్నికల సంఘం , ఎస్ ఐ ఆర్ ల పై కాంగ్రెస్ వివాదాలను లేవనెత్తి నిరసనలు చేయడం ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం లాంటిదన్నారు.కాంగ్రెస్ చేపట్టిన "నవంబర్ 1 రామ్‌లీలా నిరసన" రాజ్యాంగ పరిరక్షణ కోసం కాదని, కాంగ్రెస్ రాజకీయ క్రీడలో భాగమని స్పష్టం చేశారు . దేశంలో కాంగ్రెస్ అవలంబిస్తున్న విధానాలను , అరాచక పద్ధతులను ప్రజాక్షేత్రంలో ఎండ గట్టడానికి , ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి బిజెపి ఆధ్వర్యంలో ఈనెల 5న కరీంనగర్లో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో ప్రజలు ,యువత , మహిళలు స్వచ్ఛందంగా భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కరీంనగర్ నగర పాలక సంస్థ మహిళా కార్పొరేటర్లు, ,సర్పంచ్ లు వివిధ మండలాల మహిళా మోర్చా అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట పోలీసుల మానవత్వం

రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 31: (నేటినిజం ప్రతినిధి): ఎల్లారెడ్డిపేట మండలంలోని మొదటి బైపాస్ రోడ్డుపై శనివారం ఉదయం ఓ మహిళ అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో రోడ్డుపై కుప్పకూలిపోయింది. అదే సమయంలో విధి నిర్వహణలో భాగంగా అటుగా వెళు ్తన్న బ్లూకోట్ పోలీస్ కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డు శ్రీనివాస్ చారిలు ఈ విషయాన్ని గమనించారు.వెంటనే స్పందించిన వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా మహిళ వద్దకు చేరుకుని మానవతా దృక్పథంతో ప్రథమ చికిత్స అందిస్తూ, ఆమె చేతులు, కాళ్లు రుద్దడంతో కొద్దిసేపటికే ఆ మహిళ స్పృహలోకి వచ్చింది. విధి నిర్వహణలో ఉన్నప్పటికీ తోటి మనిషి ప్రాణాపాయ పరిస్థితిలో ఉండటాన్ని గమనించి వెంటనే స్పందించిన కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డు శ్రీనివాస్ చారిల లను ఎల్లారెడ్డిపేట మండల ప్రజలు అభినందిస్తున్నారు.

తెలంగాణలో క్రాప్ హాలిడేపై మంత్రి తుమ్మల క్లారిటీ



హైదరాబాద్, అక్టోబర్ 31: రాష్ట్రంలో క్రాప్ హాలిడేపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో ప్రభుత్వం ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. క్రాప్ హాలిడేపై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న ప్రచారం అవాస్తవమని.. రైతులు ఈ విషయాన్ని నమ్మొద్దని అన్నారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్త విపత్తు అని.. ఈ విషయంలో ముందస్తు జాగ్రత్తలను తాము తీసుకుంటున్నామని తెలిపారు. ఆరు నెలలుగా రైతన్నలకు ఎల్‌నినోపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి, సమీకృత పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు.

ప్రతి వారం వాతావరణం, వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను అన్నదాతలకు చేరవేస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. రైతులకు సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో 365 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించి, రైతన్నలకు అండగా తమ ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఖరీఫ్ పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాన్నామని చెప్పారు. అన్నదాతలకు కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తోందని తెలిపారు. రైతన్నలను నష్టాల నుంచి కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం వస్తోందని.. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కల్పిస్తోందని వెల్లడించారు. నవంబర్ నుంచి మార్చి వరకు మొత్తం 35.21 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రైతన్నలు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.ల

కండరాల క్షీణతతో బాధపడే చిన్నారులకు అండగా ఉంటాం: సజ్జనార్



హైదరాబాద్, అక్టోబర్ 31: కండరాల క్షీణత, బలహీనత (మస్క్యులర్ డిస్ట్రోఫీ)తో బాధపడే చిన్నారులకు అండగా ఉంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ భరోసా కల్పించారు. మస్క్యులర్ డిస్ట్రోఫీని జెనెటిక్ టెస్టుల ద్వారానే అరికట్టగలమని వ్యాఖ్యానించారు. కండరాల క్షీణత వ్యాధిపైన దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో సీపీ సజ్జనార్ మాట్లాడారు. చాలా ప్రాంతాల్లో కండరాల క్షీణతతో బాధపడుతున్న చిన్నారులను తాను చూశానని తెలిపారు. బాధిత పిల్లలకు భారత్ ఎండీ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత్ ఎండీ ఫౌండేషన్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు.

ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలి..

మనలో ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. కండరాల క్షీణత అనేది చాలా తీవ్రమైన వ్యాధి అని చెప్పుకొచ్చారు. ఈ రోజుల్లో చాలామంది పిల్లలను కన్న తర్వాత చెత్తకుప్పల్లో పడేస్తున్నారని.. కానీ పిల్లలకు తీవ్రమైన వ్యాధి ఉన్నప్పటికీ, వాళ్లను అపురూపంగా చూసుకుంటున్నారని... అలాంటి తల్లిదండ్రులు చాలా గ్రేట్ అని అభినందించారు. ఈ వ్యాధి ఉన్న చిన్నారుల సింగిల్ పేరెంట్స్‌ను కూడా తాను చాలామందిని చూశానని అన్నారు. అలాంటి తల్లిదండ్రులకు తగిన గుర్తింపు ఇవ్వాలని సూచించారు.

దాదాపుగా 60 మంది చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని సజ్జనార్ తెలిపారు. ఈ 60 మంది పిల్లలు చాలామంది వెరీ టాలెంటెడ్‌గా ఉన్నారని.. వాళ్లు మన అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నవాళ్లే కొంతమంది జీవితం భారంగా ఉందని ఫీల్ అవుతారని తెలిపారు. కానీ తీవ్రమైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల్లో చిరునవ్వును చూసి తనకు చాలా ఆనందంగా అనిపించిందని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

వేములవాడలో దొంగల హల్ చల్..!..

నిర్మాణంలో ఉన్న భవనాల్లో విలువైన విద్యుత్ వైర్లు చోరీ
ఇప్పటికే రూ.10 లక్షల విలువైన విద్యుత్ వైర్ల చోరీ
ఆందోళనతో పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 31: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో దొంగలు హల్ చల్ సృష్టిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకొని విలువైన వస్తువులను చోరీ చేస్తుండగా యజమానులు ఆందోళన గురవుతున్నారు.

వేములవాడ పట్టణంలోని రాజీవ్ నగర్ లో మల్లేశం అనే యజమాని నూతనంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. నిర్మాణ పనులు కూడా చివరి దశకు చేరాయి. ఇంకో వారం రోజుల్లో పనులు పూర్తవుతాయనిగా శనివారం ఇంట్లోని విలువైన విద్యుత్తు వైరును దొంగలించినట్లుగా గుర్తించారు.

మొదటి అంతస్తుతోపాటు రెండో అంతస్తులో అమర్చిన విద్యుత్తు వైర్లను పూర్తిగా దొంగతనానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు.

సుమారు రూ.2.5ఏ లక్షల విలువైన విద్యుత్ వైర్ చోరీకి పాల్పడ్డగా బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

ఇక ఇది ఇలా ఉండగా 15 రోజుల క్రితం మార్కండేయ నగర్ లో మహేష్ అనే యజమాని ఇంట్లోనూ ఇదే తరహాలో విద్యుత్ వైర్ దొంగతనానికి పాల్పడినట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠా ఇలా పట్టణంలో నిర్మాణంలో ఉన్న దాదాపు 10 ఇండ్లలో విద్యుత్ వైర్లు దొంగతనాన్ని పాల్పడగా పోలీసులు విచారణ చేపడుతున్నారు.

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న గవర్నర్ శుక్లా



నల్గొండ, లఅక్టోబర్ 31: తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కుటుంబ సమేతంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు.

రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ , దేవస్థానం బోర్డు సభ్యులు లక్ష్మీనారాయణ తదితరులు గవర్నర్‌కు ఘనంగా స్వాగతం పలికారు.

జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్మృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 28వ తేదీ నుంచి యాదగిరిగుట్ట దేవస్థానంలో నిర్వహిస్తున్న తెలంగాణ వేద విద్వన్మహానభలకు గవర్నర్ హాజరై విచ్చేశారు. దర్శనానంతరం అర్చకులు వేదమంత్రాలతో వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో స్వామివారి జ్ఞాపిక (మొమెంటో), ప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ వేదాల గురించి పిల్లలకు అవగాహన వస్తే మన ప్రాచీన సాంస్కృతిక మ, విద్యా సంప్రదాయం కచ్చితంగా పరిరక్షించబడుతుందని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణ, అభివృద్ధి , నైతికతతో ఎలా బతకాలి అనే విషయాలతో పాటు శాస్త్రీయ కోణాలపై జ్ఞానం పెరుగుతుందని అన్నారు. ఎల్‌నినో కారణంగా వర్షపాతం లోటు దరిమిలా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని ప్రజలపై కూడా ఉందని వివరించారు.

ఏపీకి తెలంగాణ విద్యుత్ సాయం..

విద్యుత్ పునరుద్ధరణ పనులపై ఆరా
అవసరమైన సిబ్బంది, సామాగ్రి అందిస్తామని హామీ
ఇప్పటికే ఏపీలో 1,100 మంది తెలంగాణ విద్యుత్ సిబ్బంది

హైదరాబాద్, అక్టోబర్ 31:: తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. తుఫాన్ కారణంగా విద్యుత్ వ్యవస్థ దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు ఏ మేరకు కొనసాగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది లేదా అవసరమైన సామగ్రి కొరత ఉంటే తమకు తెలియజేయాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు.ఇప్పటికే తెలంగాణ నుంచి 1,100 మంది విద్యుత్ సిబ్బంది ఏపీలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, సరఫరా వ్యవస్థలను పునరుద్ధరించే పనుల్లో వారు నిమగ్నమయ్యారు. అవసరమైన చోట మరింత సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

కురవిలో స్కూల్ వ్యాన్ బోల్తా, 12 మంది విద్యార్థులకు గాయాలు..

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31:పాఠశాలకు వెళ్లేందుకు ఎంతో ఉత్సాహంగా స్కూల్ వ్యాన్ ఎక్కిన చిన్నారులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిర్లక్ష్యంతో విద్యార్థులతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో 12 మంది చిన్నారులు గాయపడ్డారు. అయితే వ్యాన్ చెరువు శిఖంలోని బూరుగు చెట్టుకు తగిలి ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేదంటే వ్యాన్ నేరుగా చెరువులోకి దూసుకెళ్లి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని గీతాంజలి ప్రైవేట్ పాఠశాలకు చెందిన టాటా ఏస్ వ్యాన్ శనివారం ఉదయం రేకుల తండాలో విద్యార్థులను ఎక్కించుకుంది. అనంతరం కురవి, తిరుమలాపురం గ్రామాల్లో మరికొందరు చిన్నారులను ఎక్కించుకుని నల్లెల్లకు బయలుదేరింది. ఈ క్రమంలో తిరుమలాపురం శివారులోని పెద్ద చెరువు కల్వర్టు వద్దకు రాగానే వ్యాన్ ఒక్కసారిగా అదుపుతప్పింది. రోడ్డు దిగి కల్వర్టు అంచు నుంచి కిందకు వెళ్లి చెరువు శిఖంలో బోల్తాపడింది. ఈ క్రమంలో అక్కడున్న బూరుగు చెట్టుకు వ్యాన్ తగిలి ఆగిపోయింది. వ్యాన్ చెట్టుకు తగిలి ఆగిపోవడంతో అందులోని చిన్నారులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. చెట్టు అడ్డుగా లేకుంటే వ్యాన్ నేరుగా చెరువులోకి దూసుకెళ్లేదని స్థానికులు పేర్కొన్నారు.

ఈ ప్రమాదంలో రేకుల తండాకు చెందిన రెండో తరగతి విద్యార్థిని దక్షిత, రామచంద్రాపురానికి చెందిన యూకేజీ విద్యార్థి వేదాంశ్, తిరుమలాపురానికి చెందిన వెల్లెను వేదాంశ్, కురవికి చెందిన కానుగంటి తన్మయి శ్రీతో పాటు మొత్తం 12 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న కురవి ఎస్సై సతీష్ పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

ప్రమాదం గురించి తెలియగానే పిల్లల తల్లిదండ్రులు ఘటనాస్థలికి చేరుకున్నారు. డ్రైవర్ పందిరి రాజేష్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. వాహనం నడుపుతున్న సమయంలో ఫోన్‌లో మాట్లాడుతుంటాడని డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొందరు అతడిపై దాడికి పాల్పడటంతో డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా, వ్యాన్ డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చిన్నారులను పాఠశాలకు తీసుకెళ్లే వాహనాల విషయంలో ఇలాంటి నిర్లక్ష్యాన్ని సహించకూడదని, సంబంధిత అధికారులు, పాఠశాల యాజమాన్యం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు.

జీవనశైలి మార్పులతో పర్యావరణ పరిరక్షణ

(01 నవంబర్ : "ప్రపంచ వేగన్(శాఖాహార) దినం" సందర్భంగా)

పండ్లు, కాయలు, ఆకుకూరలు, కూరగాయలు, ఆహార ధాన్యాలు, పప్పులు, నట్స్, గింజలు, సూపర్‌ఫుడ్స్ లాంటి వృక్ష సంబంధ ఆహార పదార్థాలను "వేగన్ ఫుడ్"గా వర్గీకరిస్తారు. వృక్ష లేదా మొక్కల నుంచి లభించే ఉత్పత్తులను మాత్రమే తమ ఆహారంగా తీసుకునే వ్యక్తులను "వేగన్స్" అని, ఇలాంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని ప్రచారం చేసే ఉద్యమాన్ని "వేగనిజం" అని పిలుస్తున్నాం. జంతు సంబంధ మాంసం, పాలు, పాల ఉత్పత్తులు, జంతు కొవ్వు, గుడ్లు, తేనె లాంటి ఆహార పదార్థాలకు దూరంగా కేవలం మొక్కలు లేదా వృక్షాల నుంచి లభించే ఉత్పత్తులను వినియోగించడం,

వీటి ప్రాధాన్యాలను వివరించడం, వేగనిజ్వండి పాటించడానికి ప్రజలను చైతన్య పరచడం లాంటి ఉన్నత లక్ష్యాలతో 1994 నుంచి ప్రతి ఏట 01 నవంబర్‌న "ప్రపంచ వేగన్ దినోత్సవాన్ని" పాటించుట ఆనవాయితీగా మారింది. లూయిస్ వాల్లిస్ చొరవతో యూకెలో ఏర్పడిన తొలి వేగన్ సొసైటీ 50వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచ వేగన్ దినం పాటించుట జరుగుతున్నది.

వేగనిజం ప్రయోజనాలు:

వేగన్ లేదా శాఖాహార ఉత్పత్తులను మాత్రమే తీసుకొనుట మన జీవనశైలిలో అలవాటు అయితే మానవాళి ఆరోగ్యంతో పాటు జంతు సంరక్షణ, భూగ్రహ పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతాయని తెలుసుకోవాలి.

జంతు సంబంధ ఆహార పదార్థాలతో పాటు జంతు ఉత్పత్తుల నుంచి తయారైన వస్త్రాలు, ఎముకలతో తయారైన ఉత్పత్తులు, తోలు సంబంధ వస్తువులు మొదలగు వాటి వాడకాన్ని కూడా వేగన్స్ నిషేధిస్తారు.

జంతు ఆహార ఉత్పత్తులు తినడం లేదా వాడడంతో జీవ వైవిధ్యం దెబ్బ తినడం, జంతు హింస, సాదు జంతువుల వల్ల అడవుల్లో హరిత క్షేత్రాలు పలచబడడం, పర్యావరణ కాలుష్యానికి ఆజ్యం పోయడం, భూతాపం పెరగడం లాంటి ప్రతికూల మార్పులకు దారి తీస్తుందని, కేవలం వృక్ష సంబంధ ఆహారం లేదా ఇతర ఉత్పత్తులు వాడడం వల్ల మానవాళి ఆరోగ్యంతో పాటు సుస్థిర పర్యావరణం, జీవ వైవిధ్యం ఫలిస్తాయని తెలుసుకోవాలి.

వరల్డ్ వేగన్ డే సందర్భంగా శాఖాహారాన్ని ప్రోత్సహిస్తూ చగోవేగన్, చవేగన్‌లైఫ్‌స్టైల్, చప్లాంట్‌బేస్డ్‌ఛాయిసెస్ లాంటి హాష్‌ట్యాగులతో సామాజిక మాధ్యమాలు, వేగన్ డే వేదికలు, విద్యాలయాల్లో ముమ్మర ప్రచారం చేయడానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దాం, ఆరోగ్యకర పౌరన వనాజాన్ని/వర్యావరణాన్ని/ జంతుజాలాన్ని నిర్మిద్దాం.



-మధుపాళీ
9949700037

లక్షెట్టిపేట అభివృద్ధికి రూ.18 లక్షలు.. రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆమోదం

పలు వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు మున్సిపల్ పాలకవర్గం నిర్ణయం



ఆదిలాబాద్, అక్టోబర్ 31: పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు లక్షెట్టిపేట మున్సిపల్ పాలకవర్గం ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా వివిధ వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ కోసం సుమారు రూ.18 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మున్సిపల్ సాధారణ సమావేశం ఆమోదం తెలిపింది.

ఈ పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడంతోపాటు పారిశుద్ధ్య సమస్యలు తగ్గనున్నాయి. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ దొంత అంజలి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టాల్సిన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులపై సభ్యులు చర్చించి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మోత్కూరి రాజేశ్వరి, కమిషనర్ కె. విజయ్ కుమార్, మేనేజర్ కె. రాజశేఖర్, ఎంఏఈ ఆఫ్రీన్, ఆర్ఐ టి. రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కందుల రాజేష్, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో ఉత్తమ సేవలందించిన వారికే గుర్తింపు

40 ఏళ్ల పాటు కృష్ణారావు సేవలు అభినందనీయం

జన్నారం ఎఫ్‌డీఓ ఎం. రామ్మోహన్



ఆదిలాబాద్, అక్టోబర్ 31: ఉద్యోగుల్లో ఉత్తమ సేవలందించిన వారికే మంచి గుర్తింపు ఉంటుందని, అటవీ శాఖలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా 40 ఏళ్ల పాటు కృష్ణారావు అందించిన సేవలు అభినందనీయమని జన్నారం ఎఫ్‌డీఓ ఎం. రామ్మోహన్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్‌లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసి శనివారం వదవీ విరమణ చేస్తున్న కోట కృష్ణారావు, లక్ష్మి దంపతులను స్థానిక టీడీసీలో ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ అటవీ శాఖలో కృష్ణారావుకు మంచి గుర్తింపు ఉందన్నారు. కుటుంబాన్ని మంచి మార్గంలో నడిపిస్తూ, విధి నిర్వహణలో అధికారులతో పాటు ప్రజలతో మమేకమై సేవలం దించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం, తాళ్లపేట ఫారెస్ట్ రేంజర్లు బాబా ఖాదర్ వలీ, జి. వికాస్, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. శేషారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు

మయన్మార్‌తో సంబంధమున్న మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌ను గట్టి దెబ్బ కొట్టిన డీఆర్ఐ:

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:భారతదేశ ఈశాన్య ప్రాంతంలో జరుగుతున్న సీమాంతర మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌కు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) మరో భారీ షాక్ ఇచ్చింది. మిజోరాం, అస్సాంలలో పక్కా నిఘా సమాచారంతో వేర్వేరుగా చేపట్టిన రెండు ఆపరేషన్లలో పెద్ద ఎత్తున 50 కిలోల మెథాంఫెటమైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిలో 30 కిలోల మెథాంఫెటమైన్ టాబ్లెట్లు (యాబా), 20 కిలోల క్రిస్టల్ మెథాంఫెటమైన్ రకాలు ఉన్నాయి. ఈ విషయంలో ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్) చట్టం-1985లోని నిబంధనల ప్రకారం నలుగురిని అరెస్ట్ చేశారు.

జోఖౌతార్ నుంచి ఐజ్వాల్, సిల్చార్ వైపునకు వివిధ మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో అస్సాం రైఫిల్స్ సహాయంతో డీఆర్ఐ అధికారులు 2026 అక్టోబర్ 29న ఐజ్వాల్?ఛంపై రహదారిపై ఐజ్వాల్ శివార్లలో ఒక మహీంద్రా బోలెరో క్యాంపర్ వాహనాన్ని పట్టుకున్నారు. దానిని క్షుణ్ణంగా తనిఖీ చేయగా స్టోరేజ్ క్యాబినెట్ కలిగిన ఆఫీస్ టేబుల్ లోపల ప్రత్యేకంగా తయారుచేసిన ఖాళీ ప్రదేశంలో దాచిన 30 కిలోల గులాబీ-నారింజ రంగు టాబ్లెట్లతో కూడిన 30 ఇటుక పరిమాణపు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మాదక ద్రవ్యాలను దాచిపెట్టేందుకు ఫర్నిచర్‌ను వాడారు. ఇది సాధారణ గృహ లేదా ఆఫీస్ వస్తువులను రవాణా చేస్తున్నట్లు నమ్మించేందుకు ఈ కొత్త పద్ధతిని ఎంచుకున్నారు.

2026 అక్టోబర్ 30న మరొక పక్కా నిఘా ఆపరేషన్‌లో భాగంగా అస్సాం రైఫిల్స్ సహకారంతో డీఆర్ఐ అధికారులు సిల్చార్‌కి దాదాపు 40 కి.మీల దూరంలో ఉన్న ధోలై వద్ద ఒక అశోక్ లేలాండ్ ట్రక్కు, బోలెరో క్యాంపర్‌ను పట్టుకున్నారు. ట్రక్కును తనిఖీ చేయగా దొరికిన 20 కిలోల 20 క్రిస్టల్ మెథాంఫెటమైన్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి వీటిని విదేశీ మార్కింగ్‌లు ఉన్న తేయాకు ప్యాకెట్లలో ప్యాక్ చేసి డ్రైవర్ క్యాబిన్ పైన దాచారు.

వారణాసి - న్యూఢిల్లీ మధ్య కొత్త వందేభారత్ స్లీపర్ రైళ్లను రేపు ప్రారంభించనున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, రైల్వే మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 31: వారణాసి - న్యూఢిల్లీ మధ్య కొత్త వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టడం ద్వారా ఆధునిక రాత్రి రైలు ప్రయాణ సేవలను మరింత విస్తరించే దిశగా భారతీయ రైల్వే సిద్ధమైంది. ఈ రైళ్లతో నగరాల మధ్య రవాణా అనుసంధానం మరింత బలోపేతం కానుంది. సుదూర ప్రాంతాలకు రాత్రిపూట ప్రయాణించే ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతితో పాటు వేగవంతమైన, సమర్థవంతమైన రవాణా నదుపాయం అందుబాటులోకి రానుంది.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ రేపు వారణాసిలో వారణాసి - న్యూఢిల్లీ మధ్య నడిచే కొత్త వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించనున్నారు.

2026 జనవరిలో హౌరా - గువాహటి మార్గంలో వందేభారత్ స్లీపర్ రైళ్లను, తిరుగు ప్రయాణ సేవలను ప్రారంభించిన తరువాత తాజాగా ప్రవేశపెడుతున్న ఈ రైళ్లతో మరిన్ని ప్రాంతాలకు ఈ అత్యాధునిక రైలు సేవలు విస్తరించనున్నాయి. రైలు లోపల మెరుగైన సౌకర్యాలు, అధునాతన భద్రతా ఏర్పాట్లు, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన నిద్రించే సదుపాయాలతో సుదూర రాత్రి ప్రయాణాలను మరింత సౌకర్యవంతంగా, విశ్వసనీయంగా, ప్రయాణికుల అవసరాలకు ప్రాధాన్యమిచ్చేలా తీర్చిదిద్దేందుకు భారతీయ రైల్వే కృషి చేస్తోంది.

వారణాసి - న్యూఢిల్లీ: ప్రముఖ పుణ్యక్షేత్రం, దేశ రాజధాని మధ్య మరింత మెరుగుపడనున్న రవాణా అనుసంధానం

వారణాసి - న్యూఢిల్లీ మధ్య వందేభారత్ స్లీపర్ రైలు సేవతో దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రాల్లో ఒకటైన వారణాసికి, దేశ రాజధాని ఢిల్లీకి మధ్య రవాణా అనుసంధానం మరింత బలోపేతం కానుంది.

వారణాసికి ఏడాది పొడవునా భక్తులు, దేశ, విదేశీ పర్యాటకులు, విద్యార్థులు, ఇతర సందర్శకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. న్యూఢిల్లీతో రాత్రిపూట రైలు ప్రయాణ సదుపాయం మెరుగుపడటం వల్ల ఆధ్యాత్మిక, విద్యా, వృత్తి, పరిపాలనా, పర్యాటక అవసరాల కోసం ప్రయాణించే వారికి మరింత సౌకర్యం కలగనుంది. ఈ రైలు వారణాసి, ప్రయాగ్‌రాజ్, కాన్పూర్ సెంట్రల్, అలీగఢ్, ఘజియాబాద్ మీదుగా న్యూఢిల్లీకి చేరుకుంటుంది. ఈ స్టేషన్లు కీలక పట్టణ కేంద్రాలకు సేవలందించడంతో పాటు పరిసర జిల్లాలకు కూడా రవాణా సదుపాయాన్ని కల్పించడం ద్వారా ఆధునిక రైలు ప్రయాణ సౌకర్యాలు మరింత విస్తృత సంఖ్యలో ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ కొత్త రైలు వారణాసిలో రాత్రి 8:50 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6.10 గంటలకు న్యూఢిల్లీ చేరుకుంటుంది.

పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా అయిదో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ ప్రచార కార్యక్రమం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31:పింఛను, పింఛనుదారుల సంక్షేమ శాఖ (డీఓపీపీడబ్ల్యూ) ఆధ్వర్యంలో 2026 నవంబర్ 1 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా 2,000 నగరాలు, జిల్లాల్లో అయిదో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ) ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలను 2026 ఆగస్టు 13న జారీ చేసిన కార్యాలయ మెమోరాండం (ఓఎం) ద్వారా శాఖ ప్రకటించింది. ఇప్పటివరకు నిర్వహించిన వాటిలో ఇదే అతిపెద్ద డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రచార కార్యక్రమం కానుంది.

దేశంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న పెన్షనర్లను సైతం చేరుకోవాలనే లక్ష్యంతో పెన్షన్లు చెల్లించే బ్యాంకులు, ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు, పెన్షనర్ల సంక్షేమ సంఘాలు, సీజీడీఏ, టెలికమ్యూనికేషన్స్ శాఖ, రైల్వేలు, ఈపీఎఫ్ఓ, రాష్ట్ర ప్రభుత్వాలు, యుఐడీఏఐ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ సమన్వయంతో ప్రభుత్వంలోని అన్ని విభాగాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఈ ప్రచార కార్యక్రమంలో ప్రధానంగా ముఖ గుర్తింపు ధ్రువీకరణ సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారించనున్నారు. ఎలక్ట్రానిక్స్,సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ, యుఏడీఏఐ ఈ కార్యక్రమానికి సాంకేతిక సహకారం అందించనున్నాయి. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందేందుకు ముఖ గుర్తింపు ధ్రువీకరణ సులభమైన, వేగవంతమైన విధానం. ఆంధ్రా బ్యాంకుతో పాటు ఐఓఎన్ మొబైళ్లలోనూ దీనిని ఉపయోగించవచ్చు. దీంతో వృద్ధులైన పెన్షనర్లకు ఈ ప్రక్రియ మరింత సులభంగా, సౌకర్యవంతంగా ఉంటుంది.

ఈ ప్రచార కార్యక్రమానికి ఆడియో, వీడియో, ప్రింట్ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించేందుకు దూరదర్శన్(డీడీ), ఆల్ ఇండియా రేడియో(ఏఐఆర్), ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) బృందాలు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయి. ప్రచారంపై అవగాహన కల్పించేందుకు ఎన్ఎంఎస్‌లు, ట్వీట్లు జింగిల్స్, లఘు చిత్రాల ద్వారా కూడా ప్రచారాన్ని విస్తృతం చేయనున్నారు.

ఈ ప్రచార కార్యక్రమాన్ని 'ఉత్సవ్' తరహాలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆరోగ్య పరీక్షలు, పెన్షనర్ల ఆధార్ వివరాల నవీకరణ వంటి పలు సేవలను అందిస్తారు. అవసరమైన చోట పెన్షనర్లకు వారి ఇంటి వద్దకే సేవలు అందించనున్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార అధికారులు తక్షణ పరిష్కార విధానంతో పనిచేయనున్నారు.

పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖకు చెందిన సీనియర్ అధికారులు ఈ కార్యక్రమాన్ని వర్యవేక్షించడంతోపాటు, గుర్తించిన రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి సమీక్షలు నిర్వహించనున్నారు. పెన్షనర్లు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాల్లో భాగస్వామ్య సంస్థలు భారీ శిబిరాలను ఏర్పాటు చేయనున్నాయి. ఈ శిబిరాలకు డిఓపిపిడబ్ల్యు సీనియర్ అధికారులు హాజరుకానున్నారు.

ఉత్పత్తికి మించి పురోగతి పథంలో దూసుకుపోతున్న మత్స్య పాలన రంగం..

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31: భారతదేశ మత్స్యపాలన రంగం కేవలం ఉత్పత్తిపైనే శ్రద్ధ వహించడానికి మించి పెను మార్పుల పైన దృష్టిని సారిస్తోంది. ఈ రంగం జాతీయ ఆర్థిక వ్యవస్థలో చైతన్యవంతమైన, సాంకేతిక ఆధారిత, విలువ జోడింపునకు ప్రాధాన్యాన్నిస్తున్న రంగంగా పురోగమిస్తోంది. దేశానికి ఆహార భద్రతను, పోషణ భద్రతను బలపరచడంలో, ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో, గ్రామీణ జీవనోపాధి మార్గాలకు దన్నుగా నిలవడంలో, ఎగుమతుల రూపేణా ఆదాయార్జనలో తన వంతుగా కీలక తోడ్పాటును అందిస్తోంది.

అదనపు విలువ జోడింపు, శీతల గిడ్డంగుల అభివృద్ధి, ఆధునిక ప్రాసెసింగ్ పద్ధతులు, మొబైల్ మత్స్య విక్రయాలు, అంకుర సంస్థలు నాయకత్వ పాత్రను పోషిస్తుండగా నూతన ఆవిష్కరణలు జోరు అందుకొంటున్న తీరు.. వీటి నేపథ్యంలో మత్స్య విస్తారిత అనుబంధ వ్యవస్థలో ప్రధాన పరివర్తన చోటు చేసుకొంది. ఈ రంగంలోని వాణిజ్య సంస్థలు గుర్తింపు సామర్థ్యాన్ని ((ట్రేసబులిటీ), ఉత్పాదకతను, నాణ్యం విషయంలో హామీని, కోతల అనంతర నిర్వహణను మెరుగుపరు చుకోవడానికి కృత్రిమ మేధను (ఏఐ), ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్‌ను, బ్లాక్ చైన్, డ్రోన్ సాంకేతికత, స్మార్ట్ కోల్డ్-చైన్ వ్యవస్థలు, చేపలు/రొయ్యల పెంపకంలో కచ్చితమైన పద్ధతుల అనుసరణను రోజు రోజుకు అధిక స్థాయిలకు విస్తరించుకొంటున్నాయి. ఈ చర్యలు నష్టాలను గణనీయంగా తగ్గిస్తున్నాయి. లాభదాయకత పెరుగుతోంది. మత్స్య పాలన రంగ విలువ మరింత బలోపేతం అవుతోంది.

విలువ జోడింపు ప్రక్రియ భారతదేశ మత్స్యపాలన రంగాన్ని ప్రాథమికంగా ఉత్పత్తి కార్యకలాపాలకు పరిమితం చేయడానికి బదులు వివిధీకృత, మార్కెట్ ప్రధాన వాణిజ్య వ్యవస్థగా రూపాంతరం చెందడంలో ఓ ముఖ్య కారకంగా ఎదుగుతోంది. ఈ ప్రక్రియ.. చేపలు, మత్స్య సంబంధిత ఉత్పాదనలను ప్రాసెస్ చేసి, ప్యాక్ చేసి, బ్రాండు ఫండ్ (ఎఫ్ఐడీఎఫ్), 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' (పీఎమ్ఎమ్ఎస్‌వై), 'ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ-యోజన' (పీఎమ్-ఎమ్‌కేఎస్ఎస్‌వై), కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) వంటి ప్రధాన పథకాలు, కార్యక్రమాలను తీసుకువచ్చి రూ.39,272 కోట్లు అందించారు. మౌలిక సదుపాయాలను విస్తరించడం, ఉత్పత్తి, పంట కోత అనంతర నిర్వహణ వ్యవస్థలను పటిష్టపరచడం, దేశవ్యాప్తంగా 74.66 లక్షల మంది మత్స్యకారులు, చేపల రైతులకు ఉద్యోగ కల్పన, జీవనోపాధి అవకాశాలను అందించడం ఈ చర్యల లక్ష్యం.

దీనితో పాటు రవాణా, లాజిస్టిక్స్ నెట్‌వర్కులపైన కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా రూ.3,393.85 కోట్ల పెట్టుబడితో 46,500 కేంద్రాలను జతపరిచారు. వీటిలో చేపల రవాణా వ్యవస్థ, చిల్లర, టోకు చేపల మార్కెట్లు, చిన్న విక్రయ కేంద్రాలు, దాణా మిల్లులు, ఐస్ ప్లాంటులు, శీతల గిడ్డంగులు, విలువను జోడించే వాణిజ్య విభాగాలు ఉన్నాయి. దీనికి అదనంగా అయిదు ఆధునిక, స్మార్ట్ ఫిష్ మార్కెట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థలను, పర్యావరణ అనుకూల సాంకేతికతను, రవాణా సరఫరా వ్యవస్థలను ఒకే చోట నెలకొల్పుతున్నారు. ఈ మార్కెట్ల వల్ల 15,900 ఉద్యోగ అవకాశాలు లభించగలవని భావిస్తున్నారు.

మౌలిక నదుపాయాల కల్పనను, లాజిస్టిక్స్‌ను పటిష్టపరచడంతో పాటు అధిక నాణ్యత కలిగిన చేపల వేల్యూ చైనును పరిరక్షించడానికి వాసిగల ముడిపదార్థాల లభ్యత కూడా అంతే ప్రధానం. భారతదేశంలో అధిక విలువ కలిగిన మత్స్య ఉత్పాదనల విలువలను విస్తరించాలంటే నాణ్యమైన ముడినరకును నిరంతరం అందుబాటులో ఉంచడం కూడా ఎంతో కీలకంగా మారింది. ఈ దిశగా, వేగంగా వృద్ధి చెందే, మెరుగైన రోగనిరోధక శక్తి కలిగిన, ప్రతికూల పరిస్థితులకు తట్టుకొని నిలవగల, అధిక ఉత్పాదకత కలిగిన చేపల రకాలను అభివృద్ధి వరచడానికి జన్యుపరమైన మెరుగుదల కార్యక్రమాలను విభాగం ఆరంభించింది. ఈ ప్రయత్నంతో దేశంలో వినియోగానికి, ప్రాసెస్ చేసి ఎగుమతి చేయడానికి ట్రావుట్, రొయ్య, కత్లా, రోహూ, తిలాపియా, పంగాసియస్, సీబాస్, స్మాంపీ వంటి అధిక విలువను కలిగివుండే చేపల రకాలను అందుబాటు లోకి తీసుకురావడంలో సాయం లభించగలదని ఆశిస్తున్నారు. ఆయా చేపల రకాల ఉత్పాదన రాశిని ((ప్రొడక్షన్ బేస్) బలోపేతం చేస్తే, జన్యుపరమైన మెరుగుదలపై శ్రద్ధ తీసుకొంటే విలువ జోడించిన వాణిజ్య సంస్థలు బలపడడానికి ఆస్కారం ఉంటుంది. ఇది చేపల రైతులకు లాభదాయకతను పెంపొందించేస్తుంది. భారతదేశ మత్స్యపాలన విలువను మరింత ముందుకు తీసుకుపోవడంలోనూ తోడ్పడుతుంది.

ఈ లాభాలను చిన్న ఉత్పాదక సంస్థలకు అందించాలంటే ఉత్పాదనను బలోపేతం చేయడం, మార్కెట్ల చెంతకు చేర్చడంలో మెరుగుదలను తీసుకురావడంలో సహాయక సంస్థాగత యంత్రాంగాలు మరింత ప్రధానమైన పాత్రను పోషించవలసి ఉంటుంది. మత్స్య పాలన రంగంలో విలువ జోడింపునకు పెద్దపీట వేసే ప్రయత్నాన్ని సామూహిక వాణిజ్య సమూనాల ద్వారా ముందుకు తీసుకుపోతున్నారు. ఇలా చేసినందువల్ల చిన్న స్థాయిలో చేపలను పట్టే వారికి, చేపల రైతులకు ఎదురవుతున్న పరిమిత ఉత్పాదన, పెట్టుబడి కొరత, మార్కెట్ అందుబాటు తదితర సమస్యలను పరిష్కరించడానికి వీలవుతుంది. 2,195 షిఫరీన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఎఫ్‌పీఓన్)ను ఏర్పాటు చేయడంలో కూడా విభాగం సహకారాన్ని అందించింది.

జాలౌన్ జిల్లాలోని ఓ మారుమూల పల్లెలో చట్టవిరుద్ధంగా మత్తుపదార్థాలు తయారు చేస్తున్న ల్యాబ్ ఆటకట్టు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31:దేశంలో సింథెటిక్ డ్రగ్స్ తయారీకి వ్యతిరేకంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చేపట్టిన ఒక ప్రధాన చర్యలో భాగంగా ఉత్తరప్రదేశ్ జాలౌన్ జిల్లా లోని ఓ మారుమూల గ్రామంలో పెద్ద ఎత్తున గప్‌చిప్‌గా సాగుతున్న మాదక పదార్థాల తయారీ ప్రయోగశాల గుట్టును రట్టు చేశారు. ఈ క్రమంలో, సుమారు 1,100 కిలోల మత్తు పదార్థాలు, తయారీ కోసం వాడటానికి ఉంచిన పూర్వ-రసాయనిక పదార్థాలతో (ప్రికర్సర్ కెమికల్స్) పాటు తయారీ సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు.

రహస్య సమాచారం అందడంతో డీఆర్ఐ అధికారులతో కూడిన ఒక పెద్ద బృందం ఉత్తరప్రదేశ్ తీవ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్) సహకారంతో నిన్న, అంటే 2026 అక్టోబర్ 29న ఉదయం అనుమానిత స్థలానికి వెళ్లి సమన్వయపూర్వక దాడిని నిర్వహించింది. ఆ స్థలాన్ని సోదా చేసిన మీదట ఓ ప్రయోగశాల పూర్తి స్థాయిలో పనిచేస్తూ కృత్రిమ మందులను ఉత్పత్తి చేస్తున్నారని తేలింది. అక్కడి నుంచి 184 కేజీల సగం తయారైన మందులతో పాటు, దాదాపు 582 కేజీల రసాయనాలను, తయారీ ప్రక్రియలో ఉపయోగించిన సంబంధిత ఉపకరణాలను జప్తు చేశారు.

నిందితుల నివాస ప్రాంగణాలను తనిఖీ చేసి 15.4 కేజీల తయారైన మెథక్వాలోన్‌ను, దాదాపు 153 కేజీల రసాయనాలను, తయారీకి ఉపయోగిస్తున్న ఒక యంత్రాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. మరొక నిందితుని నివాసాన్ని సోదా చేసి 168 కేజీల పూర్వ-రసాయనిక పదార్థాలను జప్తు చేశారు. ఈ గోప్య తయారీ కేంద్రంతో సంబంధం కల ఇద్దరు వ్యక్తులను ఎన్‌డీపీఎస్ చట్టం-1985 నిబంధనల ప్రకారం అరెస్టు చేశారు.

పెద్ద ఎత్తున తయారు చేసిన మందులను, సగం తయారు చేసిన సామగ్రిని, పూర్వ-నిర్మిత రసాయనాలను, తయారీకి ఉపయోగిస్తున్న పరికరాలను స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో అక్కడ చట్టవిరుద్ధంగా మత్తు మందులను తయారు చేస్తున్న సంఘటిత నెట్‌వర్క్ చురుకుగా కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు బయటపడింది. ఈ దాడితో, అక్రమ మాదక ద్రవ్యాల తయారీ వ్యవస్థను చెప్పుకోదగిన రీతిలో దెబ్బ తీసినట్లయింది. పెద్ద ఎత్తున మందులను, వాటి తయారీకి వాడదలచిన పూర్వ నిర్మిత రసాయనాలను ధ్వంసం చేశారు. నకిలీ మందులను మరిన్నింటిని ఇకపై తయారు చేయకుండా అడ్డుకోవడంలో అధికారులు విజయం సాధించారు.

మత్తుమందులను, మానసిక రోగాన్ని తెచ్చిపెట్టి మనుషులను వ్యసనపరులుగా మార్చివేసే పదార్థాలను అక్రమంగా చేరవేసే వర్గాల పని పట్టడానికి డీఆర్ఐ కట్టుబడి ఉంది. ఈ మందులను గుట్టుగా తయారు చేస్తున్న నెట్‌వర్కులను దెబ్బతీయడంతో పాటు, చట్టానికి వ్యతిరేకంగా ఈ మందులను సరఫరా చేస్తున్న వ్యవస్థలను భగ్నం చేయాలనే కృత నిశ్చయంతో డీఆర్ఐ పనిచేస్తోంది.

'అర్ణబ్' తుపాను నేపథ్యంలో టెలికాం సేవలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం చర్యలు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31: ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీర ప్రాంతాలను 'అర్ణబ్' తుపాను తాకిన నేపథ్యంలో, ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సమాచార సేవలకు అంతరాయం కలగకుండా టెలికమ్యూనికేషన్స్ శాఖ (డీఓటీ), టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల (టీఎస్‌పీలు) సమన్వయంతో సేవల పునరుద్ధరణ చర్యలు చేపడుతోంది. టెలికాం నెట్‌వర్క్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, చెట్లు కూలిపోవడం, విద్యుత్ మౌలిక సదుపాయాలకు అంతరాయం కలగడం వల్ల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పరిసర ప్రాంతాల్లోని పలు చోట్ల టెలికాం సేవలకు ఆటంకం ఏర్పడింది.

ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో నెట్‌వర్క్ అనుసంధానాన్ని పునరుద్ధరించడంలో గణనీయమైన పురోగతి సాధించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలను పరిష్కరించడం, ఆప్టికల్ ఫైబర్ అనుసంధానాన్ని పునరుద్ధరించడంపై దృష్టి సారించారు. పౌరులకు నిరంతర సమాచార సేవలు అందించడంతో పాటు, ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాలకు మద్దతు ఇచ్చేందుకు ఇంట్రా-నర్కిల్ రోమింగ్ (ఐసీఆర్), సెల్ ఆన్ వీల్స్ (సీఓడబ్ల్యూ) వంటి అత్యవసర సమాచార ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం టెలికాం నెట్‌వర్క్ అందుబాటు 99.18 శాతానికి చేరుకుంది. ప్రభావిత జిల్లాల్లో పశ్చిమ గోదావరిలో 98.5 శాతం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 91.96 శాతం నెట్‌వర్క్ అందుబాటులో ఉంది. వాణిజ్య విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్థానికంగా ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సీ) తెగిపోవడం నెట్‌వర్క్ కార్యకలాపాలకు ప్రధాన ఆటంకాలుగా ఉన్నాయి. వినియోగదారులు తమ టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌తో సంబంధం లేకుండా కనెక్టివిటీ పొందేందుకు ప్రభావిత జిల్లాలన్నింటిలో ఇంట్రా-నర్కిల్ రోమింగ్ (ఐసీఆర్) సేవలు కొనసాగుతున్నాయి. అదనంగా అత్యవసర సమాచార సేవలను మరింత బలోపేతం చేసేందుకు 11 'సెల్ ఆన్ వీల్స్' (సీఓడబ్ల్యూ) యూనిట్లను మోహరించారు.

ఒడిశాలో 'అర్ణబ్' తుపాను ప్రభావం తర్వాత గంజాం, గజపతి, కంధమాల్ జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడం, వరద నీరు క్రమంగా తగ్గుతుండటంతో టెలికాం నెట్‌వర్క్ పరిస్థితి మెరుగుపడుతోంది. టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల (టీఎస్‌పీలు) ప్రభావిత ప్రాంతాల్లో సేవల పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. దీంతో నెట్‌వర్క్ అనుసంధానం క్రమంగా మెరుగుపడటంతో పాటు, సేవల్లో అంతరాయాలు తగ్గుతున్నాయి. మిగిలిన ప్రభావిత ప్రాంతాల్లోనూ సేవలను పునరుద్ధరించి, టెలికాం సేవలను త్వరగా సాధారణ స్థితికి తీసుకురావడంతో పాటు ప్రజలకు నిరంతర కనెక్టివిటీ అందించేందుకు అన్ని టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు ప్రాధాన్య ప్రాతిపదికన నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇంట్రా నర్కిల్ రోమింగ్ (ఐసీఆర్) అనేది ఒకే టెలికాం సర్కిల్ (ప్రాంతం) పరిధిలో మొబైల్ వినియోగదారుడు మరో టెలికాం ఆపరేటర్ (టీఎస్‌పీ) నెట్‌వర్క్‌కు అనుసంధానమయ్యే సదుపాయం. ఒక నిర్దిష్ట ప్రాంతంలో వినియోగదారుడి సొంత టెలికాం ఆపరేటర్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోయినా, మరో ఆపరేటర్ నెట్‌వర్క్ ద్వారా మొబైల్ సేవలను పొందేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ముఖ్యంగా ప్రకృతి విపత్తుల సమయంలో మొబైల్ మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నప్పుడు ఈ సదుపాయం కీలక పాత్ర పోషిస్తుంది.ప్రకృతి విపత్తు సమయంలో ఒక ప్రాంతంలో మొబైల్ మౌలిక సదుపాయాలు దెబ్బతింటే, ఐసీఆర్ అమలు చేయాలని టెలికమ్యూనికేషన్స్ శాఖ టెలికాం సర్వీస్ ప్రొవైడర్లకు ఆదేశాలు జారీ చేస్తుంది.

ఈఎస్‌టీఐసీ-2026 వేదికగా 'సెమికండక్టర్లు, నెక్ట్-జనరేషన్ చిప్స్' అంశంపై ప్రత్యేక చర్చా సమావేశం నిర్వహించిన డీఆర్‌డీవో

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31: న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించిన 'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్' (ఈఎస్‌టీఐసీ)-2026లో రక్షణ రంగ పరిశోధనాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) పాలుపంచుకుంది. 'సృజనాత్మక మేధస్సులు, విజ్ఞాన శాస్త్ర ప్రేరణ, సమాజ సాధికారత' అనే ప్రధాన నినాదంతో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక సదస్సును ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు మార్గదర్శనంలో 12 ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలు సంయుక్తంగా దీనిని నిర్వహించాయి. శాస్త్రీయ నాయకత్వంలో సరికొత్త విప్లవానికి నాంది పలికేలా సాగిన ఈ కార్యక్రమంలో అత్యంత అధునాతన పరిశోధనలు, డీప్-టెక్ ఆవిష్కరణలను ప్రదర్శించడంతో పాటుగా... నోబెల్ బహుమతి గ్రహీతలు, అంతర్జాతీయ నిపుణులు, విధానకర్తలు, యువ నాయకులతో చర్చలనూ నిర్వహించారు.

ఈ సదస్సు నిర్వహణలో కీలక భాగస్వామిగా డీఆర్‌డీవో... 'సెమికండక్టర్లు, నెక్ట్-జనరేషన్ చిప్స్' అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించింది. ప్రముఖ శాస్త్రవేత్త, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ (ఈసీఎస్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ బి.కె. దాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో... ఈ రంగానికి చెందిన ప్రముఖులు, విద్యావేత్తలు, స్వదేశీ చిప్-అభివృద్ధి వ్యవస్థకు చెందిన నిపుణులు, రక్షణ రంగ ఎలక్ట్రానిక్స్ నిపుణులు ఒకే వేదికపైకి వచ్చి ఈ చర్చలో పాలుపంచుకున్నారు.

ఈ సమావేశంలో భాగంగా డాక్టర్ బి.కె. దాస్ నమన్వయకర్తగా వ్యవహరించిన ఒక ప్రత్యేక ప్యానెల్ చర్చనూ నిర్వహించారు. ఇందులో ప్రముఖ శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ (మైక్రో ఎలక్ట్రానిక్ డివైసెస్, కంప్యూటేషనల్ సిస్టమ్స్, సైబర్ సిస్టమ్స్) డాక్టర్ షీనా రాణి ప్యానెలిస్టుగా పాల్గొన్నారు. సెమికండక్టర్ సాంకేతికతల్లో వస్తున్న సరికొత్త మార్పులు, నిర్దిష్ట అవసరాల కోసం రూపొందించే కృత్రిమ మేధ, సిస్టమ్-ఆన్-చిప్స్, సిలికాన్ ఎడ్జ్ ఆధారిత ఇంటెలిజెన్స్, మారుతున్న మైక్రోప్రాసెసర్ రంగాల గురించి ఈ చర్చల్లో లోతుగా విశ్లేషించారు. గేమ్-చేంజింగ్ ఆవిష్కరణలను అభివృద్ధి చేయడానికి, నెక్ట్-జనరేషన్ చిప్ డిజైన్‌ను వేగవంతం చేయడానికి, స్వదేశీ కోర్ సాంకేతికతలను బలోపేతం చేయడానికి పరిశ్రమలు, అంకుర సంస్థలకు డీఆర్‌డీవో అందిస్తున్న నిరంతర మద్దతును, ఆ సంస్థ కీలక పాత్రనూ ఈ సమావేశం ప్రముఖంగా చాటిచెప్పింది.

ఈఎస్‌టీఐసీ-2026 వేదికగా డీఆర్‌డీవో ఏర్పాటు చేసిన జెట్‌రీచ్ స్టాల్... సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాల్లో రక్షణ మంత్రిత్వ శాఖ కీలక కృషిని, సాధించిన విజయాలను, పరిశోధనా కార్యక్రమాలను ప్రముఖంగా ప్రదర్శించింది. డీఆర్‌డీవో పరిశోధనశాలలు స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన విభిన్నమైన సాంకేతికతలను ఇక్కడ ప్రదర్శించారు. వీటిలో అత్యాధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలు, క్వాంటం టెక్నాలజీ సమూనాలు, తీవ్రమైన చలి వాతావరణాన్ని తట్టుకునే దుస్తులు, మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'ప్రబల' ఫుల్-బాడీ ప్రొటెక్టర్, ప్యాసివ్, పవర్డ్ ఎక్సోస్కెలిటన్లు, పోర్టబుల్ హైబ్రిడ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, హై-పవర్ పల్స్ లేజర్ డయోడ్‌లు, స్క్రామ్‌జెట్ ఇంజిన్ సాంకేతికతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన ధీమాటిక్, డిపార్ట్‌మెంటల్ ప్రదర్శనల్లోనూ డీఆర్‌డీవో పాలుపంచుకుంది. ఢిల్లీలోని సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ లాబొరేటరీ అభివృద్ధి చేసిన మోనోలిథిక్ మైక్రోవేవ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, ఇన్‌ఫ్రారెడ్ ఫోకల్ ప్లేన్ ఆరేలు అనే రెండు కీలక సెమికండక్టర్ సాంకేతికతల రంగాల్లో సాధించిన విజయాలను డీఆర్‌డీవో ఇక్కడ 'సెమికండక్టర్లు, నెక్ట్-జనరేషన్ చిప్స్' థీమాటిక్ ప్రదర్శనలో ప్రముఖంగా ప్రదర్శనకు ఉంచింది.

ఈ ప్రదర్శనలో ఉంచిన గాలియం ఆర్సెనైడ్, గాలియం నైట్రైడ్ ఆధారిత మోనోలిథిక్ మైక్రోవేవ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, మల్టీ-చిప్ మాడ్యూళ్లను ఇప్పటికే పలు వ్యూహాత్మక రక్షణ మిషన్లలో ఉపయోగించారు. ఈ అధునాతన సాంకేతికతలు అత్యాధునిక రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ అప్లికేషన్లకు అత్యంత కీలకమైన పునాదిగా పనిచేస్తాయి. ఇన్‌ఫ్రారెడ్ ఫోకల్ ప్లేన్ ఆరేలు వ్యూహాత్మక క్షిపణుల కోసం 'కళ్ల'గా లేదా సెన్సింగ్ ఎలిమెంట్స్‌గా పనిచేస్తూ... ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ (ఐఐఆర్) సీకర్ల ద్వారా క్షిపణి లక్ష్యాన్ని చేరుకునే ఆఖరి దశలో శత్రు లక్ష్యాలను గుర్తించడానికి, వాటిని కచ్చితత్వంతో ట్రాక్ చేయడానికి తోడ్పడతాయి. షార్ట్-వేవ్ ఇన్‌ఫ్రారెడ్, మిడ్-వేవ్ ఇన్‌ఫ్రారెడ్, లాంగ్-వేవ్ ఇన్‌ఫ్రారెడ్ వంటి విస్తృత శ్రేణి ఇన్‌ఫ్రారెడ్ సాంకేతికతలను ఈ ప్రదర్శనలో ఉంచడం ద్వారా... అధునాతన సెమికండక్టర్ రంగంలో డీఆర్‌డీవో సాధించిన అపారమైన స్వదేశీ సామర్థ్యాలనూ చాటిచెప్పారు.

డీఆర్‌డీవో ప్రదర్శించిన ఇతర ముఖ్యమైన ఆవిష్కరణల్లో స్క్రామ్‌జెట్ ఇంజిన్ సాంకేతికత, న్యూరోమార్ఫిక్ యాక్సిలరేటర్లు ఉన్నాయి. ఇవి సంక్లిష్టమైన, సరికొత్త సాంకేతిక రంగాల్లో సాధించిన అద్భుతమైన పురోగతిని చాటిచెప్పాయి. వీటితో పాటు అత్యాధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలు, క్వాంటం రాండమ్ నంబర్ జనరేటర్లు, రక్షణ పరికరాలు, ఎక్సోస్కెలిటన్లు, పోర్టబుల్ హైబ్రిడ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ఫోటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, లేజర్ ప్రాక్సిమిటీ సెన్సార్లనూ ఈ ప్రదర్శనలో ప్రముఖంగా ఉంచారు.

సెమికండక్టర్ సాంకేతికత దేశ సార్వభౌమాధికారానికి, ఆర్థిక బలానికి, డిజిటల్ భద్రతకు అత్యంత కీలకమైనది. స్వదేశీ సాంకేతిక సామర్థ్యాల బలోపేతం ద్వారా 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వయం-సమృద్ధ భారత్' దార్శనికతలను ముందుకు తీసుకెళ్లడంలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది. కమ్యూనికేషన్ పరికరాలు, అధునాతన సెన్సింగ్ వ్యవస్థల నుంచి అత్యాధునిక రక్షణ ప్లాట్‌ఫారమ్‌ల వరకు... ఆధునిక సాంకేతికతల పనితీరు, సామర్థ్యం, విశ్వసనీయతను ఈ సెమికండక్టర్ చిప్స్ మాత్రమే నిర్ణయిస్తాయి. చిప్ తయారీతో పాటు, సాంకేతిక స్వయంసమృద్ధినీ సాధించాలంటే చిప్ డిజైన్, ఫ్యాబ్రికేషన్, టెస్టింగ్, పారిశ్రామిక స్థాయి ఉత్పత్తి, సుస్థిర సరుకు రవాణా వ్యవస్థ వంటి సమగ్ర సామర్థ్యాలను కలిగి ఉండటం ఎంతో అవసరం.

ఎంపిక చేసిన కొత్త తరం (నెక్ట్-జనరేషన్) చిప్ సాంకేతికతల్లో ప్రపంచంలోనే ముందంజలో నిలవాలనే లక్ష్యంతో భారత్ ముందుకుసాగుతోంది. దీని ద్వారా 2047 నాటికి అంతర్జాతీయంగా గట్టి పోటీనిస్తూ... ప్రపంచంలోనే అందరూ విశ్వసించదగిన, సాంకేతిక రంగంలో సొంతంగా ఎదిగిన ఒక బలమైన సెమికండక్టర్ కేంద్రంగా అవతరించాలని భారత్ ఆకాంక్షిస్తోంది. ఈ ఆశయం కేవలం చిప్స్ తయారు చేయడంలోనే కాకుండా... మన దేశంలోనే ఒక నిరంతరాయమైన, శక్తిమంతమైన సెమికండక్టర్ వ్యవస్థను సృష్టించడాన్ని నిర్దేశిస్తుంది. తద్వారా యువతకు ఎంతో విలువైన, ఉన్నతమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు అందుతాయి.

గడిచిన కొన్నేళ్లుగా భారత వ్యూహాత్మక రక్షణ రంగ పరిశోధనశాలలు, ప్రత్యేక సెమికండక్టర్ ఫౌండ్రీలు ఈ రంగంలో అత్యంత నైపుణ్యాన్ని సాధించాయి. ఇందులో ఎస్ఎస్‌పీఎల్, గాలియం ఆర్సెనైడ్ ఎనేబ్లింగ్ టెక్నాలజీ సెంటర్, సెమికండక్టర్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ రీసెర్చ్ సెంటర్, సెమికండక్టర్ లాబొరేటరీ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ఇవి గాలియం ఆర్సెనైడ్, గాలియం నైట్రైడ్, మైక్రో-ఎలక్ట్రో-మెకానికల్ సిస్టమ్స్, ఆధునిక సిలికాన్ ప్రాసెస్ సాంకేతికతల్లో విశేషమైన నైపుణ్యాలను విజయవంతంగా అభివృద్ధి చేశాయి.

రామగుండం నవనిర్మాణమే ప్రధాన కర్తవ్యం

-ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్

కరీంనగర్, అక్టోబర్ 31: నిరుపేద వర్గాల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు.

శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం లోని జంగాలపల్లి (ఎన్టిపిసి) లో 634 మంది లబ్ధిదారులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ చేతుల మీదుగా డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లను అందజేశారు. లబ్ధిదారులకు ఇండ్ల తాళాలను అప్పగించారు. సందర్భంగా ఏర్పాటైన సభలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ప్రసంగించారు.

రామగుండం అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం రక్షకుడిగా ఉంటానని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలోని పాలకుల కుట్రపూరిత నిర్ణయాల మూలంగా రామగుండం అందుకు తాను ముందుండి పని చేస్తానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ హామీ ఇచ్చారు. విమర్శలకు ఆరోపణలకు భయపడేది లేదని రామగుండం ప్రజానీకం కూడా



వెనుకబడిందని మండిపడ్డారు. సింగరేణి బొగ్గు గనులు?విద్యుత్ కేంద్రాలు, సిమెంట్ కర్మాగారాలతో మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా వీరాంజనేయ ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని? అయితే రామగుండం నవనిర్మాణమే తన ముందున్న ప్రధాన కర్తవ్యం అని మక్కన్ సింగ్ స్పష్టం చేశారు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక నగరంగా రామగుండం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని , ఎవరికి భయపడొద్దనిదళారీ వ్యవస్థను అడ్డుకుంటాం? ఓట్ల కోసం రాజకీయం చేయడం మాకు చాతకాదనీ మక్కాన్‌సింగ్ నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, ఇన్చార్జి కమిషనర్ అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య తోపాటు కార్పొరేటర్లు, వేలాదిమంది లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం, ఆర్థిక సహకారం బలోపేతానికి లగ్జెంబర్గ్‌లో 19వ భారత్-బీఎల్ఈడబ్ల్యూ సంయుక్త ఆర్థిక కమిషన్ సమావేశం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31: భారత్-బెల్జియమ్-లగ్జెంబర్గ్ ఆర్థిక సంఘం (బీఎల్ఈడబ్ల్యూ) సంయుక్త ఆర్థిక కమిషన్ 19వ సమావేశాన్ని నిన్న, అంటే 2026 అక్టోబర్ 29న లగ్జెంబర్గ్‌లో నిర్వహించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, పెట్టుబడి సంబంధాలను సమీక్షించుకొనేందుకు, కీలక రంగాల్లో ఆర్థిక సహకారాన్ని ఇప్పటి స్థాయిలకన్న ఎక్కువగా పటిష్ఠపరుచుకొనేందుకు ఉన్న అవకాశాలను చర్చించేందుకు ఈ సమావేశం భారత్, బెల్జియమ్, లగ్జెంబర్గ్‌లకు ఓ అవకాశాన్ని కల్పించింది.

సంయుక్త ఆర్థిక కమిషన్ సమావేశానికి సహాధ్యక్షత వహించిన వారిలో భారత ప్రభుత్వ వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేశ్ అగర్వాల్ , బెల్జియమ్ విదేశీ వ్యవహారాలు, వాణిజ్యం, అభివృద్ధి మంత్రిత్వ శాఖలోని భూ-ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక దౌత్యం డైరెక్టర్-జనరల్ శ్రీ ఫిలిప్ వాండెన్ బుల్కే, లగ్జెంబర్గ్ విదేశీ వ్యవహారాలు, యూరోప్ వ్యవహారాలు, రక్షణ, అభివృద్ధి సహకారం, విదేశీ వాణిజ్య మంత్రిత్వ శాఖలో సెక్రటరీ జనరల్ శ్రీ హెన్రీ షుమాకర్ ఉన్నారు.

భారత్, బెల్జియమ్, లగ్జెంబర్గ్‌ల మధ్య ప్రస్తుత వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను 19వ సమావేశంలో సమీక్షించారు. ఆర్థిక అనుబంధాన్ని పెంపొందింపచేసుకొనేందుకు, వాణిజ్యాన్ని, పెట్టుబడులను సరళతరం చేసేందుకు, పరస్పర ఆసక్తి ఉన్న రంగాలలో సహకారాన్ని బలోపేతం చేసుకొనేందుకు అనుసరించాల్సిన మార్గాలపై చర్చించారు.

ప్రాధాన్య రంగాలన్నిటిపై చర్చించారు. ఆయా రంగాలలో గగనతల సంధానం, ఓడరేవులు, లాజిస్టిక్స్, పునరుత్పాదక ఇంధనం, స్వచ్ఛ సాంకేతికత, ఆర్థిక సేవలు, ఫిన్‌టెక్, డిజిటల్ పరివర్తన, సమాచారం, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ), ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్, ఆయుష్వద, సాంప్రదాయిక వైద్యం, వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమ వంటివి ఉన్నాయి.

ఏరోస్పేస్, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సహకారాన్ని విస్తరించుకొనేందుకు ఉన్న అవకాశాలను అన్వేషించాలని సమావేశంలో నిర్ణయించారు. మార్కెట్టుకు సంబంధించిన అంశాల్లో వాణిజ్యపరమైన నమన్యలకు పరిష్కారాన్ని కనుగొనడం, మార్కెట్టు లభ్యతను సుగమం చేయడం, ఆర్థిక సంబంధాలను మరింతగా బలవరుచుకోవడానికి ఉన్న అవకాశాలను గుర్తించడంపైనా చర్చించారు.మూడు దేశాలు ఆర్థిక ప్రాధాన్యాలపై తమ ఆలోచనలను ఒక పక్షానికి మరొక పక్షం తెలియజేసేందుకు, వివిధ రంగాల్లో సహకారాన్ని సమీక్షించుకొనేందుకు, వాణిజ్య అనుబంధం, పెట్టుబడి భాగస్వామ్యాలను ఇప్పటి కన్న పెంచుకొనేందుకు సంయుక్త ఆర్థిక కమిషన్ ఒక అవకాశాన్ని కల్పించింది. భారత్, బెల్జియమ్, లగ్జెంబర్గ్‌ల మధ్య పరస్పరం లాభదాయక ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకు పోవడానికి నిరంతర ప్రాతిపదికన చర్చలు జరుపుకొంటూ ఉండడంతో పాటు సహకరించుకోవడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ఈ చర్చలలో పునరుద్ఘాటించారు.

సంయుక్త ఆర్థిక కమిషన్ సమావేశం ముగిసిన అనంతరం, వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేశ్ అగర్వాల్ లగ్జెంబర్గ్ కేంద్రంగా పనిచేస్తున్న కంపెనీల ముఖ్య కార్యనిర్వహణ అధికారులతో వాణిజ్య ప్రధాన సమావేశాన్ని నిర్వహించారు.

వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సీఏపీఎఫ్‌లు, సీపీఓలకు చెందిన 490 మంది సిబ్బందికి 2026 సంవత్సరానికి 'కేంద్ర గృహమంత్రి దక్షత పతకం' ప్రదానం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31:వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్‌లు), కేంద్ర పోలీసు సంస్థలకు (సీపీఓలు) చెందిన 490 మంది సిబ్బందికి 2026 సంవత్సరానికి 'కేంద్ర గృహమంత్రి దక్షత పతకం' ప్రదానం చేశారు. అత్యుత్తమ పనితీరును గుర్తించడం, ఉన్నత వృత్తిపరమైన ప్రమాణాలను ప్రోత్సహించడం, సంబంధిత అధికారులు, సిబ్బంది మనోధైర్యాన్ని పెంపొందించడం ఈ పతకం లక్ష్యం.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో ప్రారంభించిన 'కేంద్ర గృహమంత్రి దక్షత పతకం' పోలీసు సిబ్బంది అందరి మనోధైర్యాన్ని మరింత పెంపొందిస్తుంది.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2024 ఫిబ్రవరి 1న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఈ పతకాన్ని ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పోలీసు బలగాలు, భద్రతా సంస్థలు, నిఘా విభాగాలు, ప్రత్యేక శాఖలు, కేంద్ర పోలీసు సంస్థలు (సీపీఓలు), కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్‌లు), జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్‌జీ), అస్సాం రైఫిల్స్ సిబ్బందికి ఈ పతకాన్ని ప్రదానం చేస్తారు. అలాగే ఫోరెన్సిక్ సైన్స్ రంగంలో (కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల స్థాయిలో) విశేష ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ శాస్త్రవేత్తలకు ఈ పతకం అందజేస్తారు. కార్యకలాపాల్లో అత్యుత్తమ ప్రతిభ, దర్యాప్తులో విశిష్ట సేవలు, అసాధారణ పనితీరు, నిఘా సేవల్లో అచంచలమైన ధైర్యసాహసాలు, ఫోరెన్సిక్ సైన్స్ రంగంలో ప్రభుత్వ శాస్త్రవేత్తలు అందించిన ప్రశంసనీయమైన సేవలను గుర్తించి ఈ పతకాన్ని ప్రదానం చేస్తారు.

సమాజ సంక్షేమమే పోలీసుల ప్రథమ ప్రాధాన్యం

ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలి

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



కరీంనగర్, అక్టోబర్ 31: పోలీసులు తమ కుటుంబ సంక్షేమం కంటే సమాజ సంక్షేమానికే ప్రాధాన్యతనిస్తూ నిరంతరం విధులు నిర్వహి

జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా భారత్‌లో తమ కార్యకలాపాలను మరింత సమన్వయం చేయనున్న ఐసీఏఆర్-సీజీఐఏఆర్: డాక్టర్ ఎంఎల్ జాట్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31: 2027 ఏప్రిల్ 12 నుంచి 17 వరకు న్యూఢిల్లీలో 'సీజీఐఆర్ శాస్త్ర, భాగస్వామ్య వారోత్సవాలు'(సైన్స్, పార్టనర్‌షిప్ వీక్) నిర్వహించనున్నట్లు సీజీఐఏఆర్, భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) సంయుక్తంగా నేడు ప్రకటించాయి. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగం (డీఏఆర్ఈ)కు చెందిన ఐసీఏఆర్, సీజీఐఏఆర్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి.

ఈ వారోత్సవానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, రైతులు, ప్రభుత్వ ప్రతినిధులు, అంకుర సంస్థలు, వ్యాపార సంస్థలు న్యూఢిల్లీకి తరలిరానున్నాయి. ఇప్పటికే రైతులకు చేరువైన నూతన ఆవిష్కరణలు, మరింత ఎక్కువ మంది రైతులకు వాటిని అందించేందుకు ఇంకా చేపట్టాల్సిన కృషి వంటి అంశాలపై వీరంతా చర్చించనున్నారు.

ఈ కార్యక్రమ నిర్వహణకు భారత్ ఆతిథ్యమిచ్చే దేశం. ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ వ్యవసాయ పరిశోధనా వ్యవస్థల్లో ఒకదానికి ఐసీఏఆర్ నాయకత్వం వహిస్తోంది. ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు 50 ఏళ్లకు పైగా సీజీఐఆర్‌తో కలిసి పనిచేస్తున్నారు. ప్రస్తుతం సీజీఐఆర్‌కు చెందిన పది పరిశోధనా కేంద్రాలు భారత్‌లో పంటలు, నీరు, పశుసంపద, చేపలు, పోషకాహారం, విధానాలకు సంబంధించిన అంశాలపై పరిశోధనలు నిర్వహిస్తున్నాయి.

భారత వ్యవసాయ శాస్త్ర రంగం ప్రభావం దేశ సరిహద్దులను దాటి విస్తరించింది. ఇక్రిశాట్ సంరక్షించి, ఇతర దేశాలకు అందించిన భారతీయ వేరుశనగ నమూనా.. మలావి, ఉగాండా, మొజాంబిక్, జాంబియాల్లో ప్రస్తుతం సాగు చేస్తున్న వేరుశనగ రకాలను అభివృద్ధి చేయడంలో దోహదపడింది. హైదరాబాద్‌లోని వ్యవసాయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారం కోసం ఏర్పాటు చేసిన సహకార కేంద్రం.. నిరూపిత మైన వ్యవసాయ ఆవిష్కరణలను ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు విస్తరిస్తోంది.

వ్యవసాయ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో అయిదు దశాబ్దాలకు పైగా భారత్‌లో గణనీయమైన పాత్ర పోషిస్తున్న భారత్-సీజీఐఏఆర్ దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగం (డీఏఆర్ఈ) కార్యదర్శి, భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఎల్ జాట్ వివరించారు.

100కు పైగా దేశాల్లో పనిచేస్తున్న 15 పరిశోధనా కేంద్రాలతో కూడిన అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధనా భాగస్వామ్య సంస్థ అయిన సీజీఐఏఆర్.. ప్రపంచ వ్యవసాయ రంగ పురోగతికి గణనీయంగా దోహదపడిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఐసీఏఆర్ ద్వారా భారత్‌తో కొనసాగిస్తున్న సహకారం పంటల అభివృద్ధి, సహజ వనరుల నిర్వహణ, ఆహార భద్రత, వ్యవసాయ ఉత్పాదకత వంటి రంగాల్లో కీలకమైన పురోగతికి తోడ్పడిందని తెలిపారు.

హరిత విప్లవం తర్వాత భారత్‌లో చోటుచేసుకున్న వ్యవసాయ పరివర్తనను ప్రస్తావిస్తూ.. సీఐఎంఎంవైటీ, ఐఆర్ఆర్ఐ, ఇక్రిశాట్ వంటి అంతర్జాతీయ పరిశోధనా సంస్థలతో సహకారం దేశ ఆహార ఉత్పత్తి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని డాక్టర్ జాట్ వివరించారు. ఒకప్పుడు ఆహార కొరతతో దిగుమతులపై ఆధారపడిన దేశంగా ఉన్న భారత్.. నేడు ప్రధాన ఆహార ఉత్పత్తి, ఎగుమతి దేశంగా ఎదిగిందని పేర్కొన్నారు.

2027లో నిర్వహించనున్న సీజీఐఏఆర్ శాస్త్ర, భాగస్వామ్య వారోత్సవాలు అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి, శాస్త్రీయ పరిజ్ఞానం, సాంకేతికతలు, ఉత్తమ విధానాల మార్పిడికి కీలక వేదికగా నిలుస్తుందని ఆయన చెప్పారు.

అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడం, ముఖ్యంగా ఆఫ్రికా దేశాలతో సహా ఇతర దేశాలతో భారత్‌లో విజయవంతమైన వ్యవసాయ ఆవిష్కరణలను పంచుకోవడం తమ ప్రాధాన్యమని డాక్టర్ జాట్ తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, డిజిటల్ వ్యవసాయం, అగ్రిస్టాక్, వ్యవసాయ యాంత్రీకరణ, చిరుధాన్యాలు, ప్రకృతి వ్యవసాయం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో భారత్ సాధించిన పురోగతి అంతర్జాతీయ సహకారానికి విస్తృత అవకాశాలను అందిస్తోందని వివరించారు.

వ్యవసాయ-ఆహార విలువ వ్యవస్థలో ఉద్భవిస్తున్న ప్రాధాన్య అంశాలపై కూడా ఈ కార్యక్రమంలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం, నీటి నిర్వహణ, నేల ఆరోగ్యం, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాలు, అంకుర సంస్థలు, యువత, మహిళల భాగస్వామ్యం, వ్యవసాయ శాస్త్రం, ఆవిష్కరణల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర వంటి అంశాలు ఇందులో ఉంటాయని పేర్కొన్నారు.

సీజీఐఏఆర్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఇస్మాహేనే ఎలౌఫీ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జరగబోయే ఈ కార్యక్రమం భారత్-సీజీఐఏఆర్ దీర్ఘకాలిక భాగస్వామ్యం సాధించిన విజయాలను గుర్తుచేసుకోవడంతో పాటు, రాబోయే 50 ఏళ్ల వ్యవసాయ సహకారానికి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. బలమైన జాతీయ శాస్త్ర పరిశోధన వ్యవస్థ విస్తృత స్థాయిలో ఎలాంటి ఫలితాలను సాధించగలదో భారత్ నిరూపించిందని ఆమె అన్నారు. భారత్‌లో అభివృద్ధి చేసిన విత్తనాలు, పరిజ్ఞానం ఇప్పటికే ఆఫ్రికా, ఆసియా దేశాల్లోని రైతులకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ ఏప్రిల్‌లో ఆ వినిమయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు, శాస్త్ర పరిశోధన ద్వారా ఇంకా ఏయే రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చో కలిసి పరిశీలించాలనుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు.

మానవ సంక్షేమాన్ని మెరుగుపరచడంలో, ఆహార వ్యవస్థలను బలోపేతం చేయడంలో శాస్త్ర విజ్ఞానం, శాస్త్రవేత్తల కృషిని గుర్తించడం కూడా ఎంతో ముఖ్యమని ఆమె తెలిపారు. 2025 ఏప్రిల్‌లో కెన్యాలోని నైరోబీలో జరిగిన తొలి కార్యక్రమం విజయవంతమైన నేపథ్యంలో, భారత్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ప్రపంచ భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేస్తుందని, వ్యవసాయ రంగంలో ఉద్భవిస్తున్న సవాళ్లకు పరిష్కారాలను రూపొందించేందుకు వివిధ రంగాల భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకువస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ, "ఆహార కొరతతో ఉన్న దేశం నుంచి ప్రధాన ఆహార ఉత్పత్తి, ఎగుమతి దేశంగా భారత్ సాగించిన వ్యవసాయ ప్రస్థానం.. శాస్త్ర, సాంకేతికత, అంతర్జాతీయ భాగస్వామ్యాల పరివర్తనాత్మక శక్తికి నిదర్శనం. 2027 సీజీఐఏఆర్ శాస్త్ర, భాగస్వామ్య వారోత్సవాల ద్వారా భారత వ్యవసాయ రంగం సాధించిన విజయాలను ప్రపంచానికి పరిచయం చేయడం, మన ఆవిష్కరణలను ఇతర దేశాలతో పంచుకోవడం, ప్రపంచవ్యాప్తంగా సాధించిన పురోగతి నుంచి నేర్చుకోవడం మా లక్ష్యం. తద్వారా వ్యవసాయం, ఆహార వ్యవస్థలు ఎదుర్కొంటున్న నూతన సవాళ్లకు ఉమ్మడిగా పరిష్కారాలను రూపొందించగలుగుతాం" అని పేర్కొన్నారు.

తొలి సీజీఐఏఆర్ సైన్స్ వారోత్సవం 2025 ఏప్రిల్‌లో కెన్యాలోని నైరోబీలో జరిగింది. ఆ కార్యక్రమంలో సీజీఐఏఆర్ తన ప్రస్తుత పరిశోధనా కార్యక్రమాల ప్రణాళికను ప్రారంభించింది. న్యూఢిల్లీలో జరిగే ఈ కార్యక్రమం శాస్త్రీయ పరిశోధనలను క్షేత్రస్థాయిలో ఫలితాలుగా ఎలా మార్చాలి, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారాన్ని భాగస్వామ్యాల ద్వారా ఎలా ముందుకు తీసుకెళ్లాలి అనే అంశాలపై దృష్టి సారించనుంది. 2047 నాటికి భారత్ సాధించాలనుకుంటున్న లక్ష్యాలకు వ్యవసాయ పరిశోధన, ఆవిష్కరణలు ఏ విధంగా దోహదపడగలవో కూడా చర్చించనున్నారు.

ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు, వక్తల పేర్లను రాబోయే నెలల్లో ప్రకటించనున్నారు.

రాజేంద్రనగర్ ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్‌లో రైతు దినోత్సవం, పీఎం-కిసాన్ ఉత్సవ్ దివస్



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31:పర్యావరణాన్ని, మానవ ఆరోగ్యాన్ని కాపాడుతూనే రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా వినూత్న ఆలోచనలు, మెరుగైన సాగు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కొత్త వంగడాలను అభివృద్ధి చేయాలని వ్యవసాయ పరిశోధకులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్-భారత వరి పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్)లో నిర్వహించిన రైతు దినోత్సవాలకు ముఖ్యఅతిథిగా మంత్రి హాజరయ్యారు. పీఎం-కిసాన్ పథకం 24వ విడత నిధులు విడుదలైన నేపథ్యంలో పీఎం-కిసాన్ ఉత్సవ్ దివస్‌ను కూడా ఈ సందర్భంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రసంగించారు. ప్రధానమంత్రి దార్శనికత అయిన వికసిత్ భారత్?2047 సాధనలో రైతులు ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారని అన్నారు. తెలంగాణలో కీలకమైన సంస్థ అయిన ఐసీఏఆర్... వ్యవసాయ పరిశోధనా రంగంలో విశేష సేవలందిస్తోందని కొనియాడారు. రైతులు మరింత సమర్థంగా పంటలు సాగు చేసేందుకు, పంట నష్టాలను తగ్గించుకునేందుకు ఐసీఏఆర్ లాంటి పరిశోధన సంస్థలు కొత్త వంగడాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు.దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు, ఒత్తిడి పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు పరిశోధనలను, ఆవిష్కరణలను నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు.

రైతులకు ఆర్థిక సాయాన్ని అందించడంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పోషిస్తున్న పాత్ర గురించి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు.

ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు, పరిశోధకుల సలహాలను, సూచనలను పాటించాలని రైతుల కు మంత్రి సూచించారు. ఉత్పాదకతను, దిగుబడులను పెంచుకోవడానికి శాస్త్రీయ మార్గదర్శకాలు, మెరుగైన సాగు పద్ధతులను అనుసరించాలని స్పష్టం చేశారు.ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనివాస్ ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేశారు. వ్యవసాయ దిగుబడిని, పంట ఆరోగ్యాన్ని, ఆదాయాన్ని పెంచడంలో రైతుకు తోడ్పడేలా సంస్థ చేపడుతున్న పరిశోధన కార్యక్రమాల గురించి వివరించారు.అనంతరం శాస్త్రవేత్తలతో రైతులు ముచ్చటించారు. ఇందులో భాగంగా ఐసీఏఎం-ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు కొత్తగా అభివృద్ధి చేసిన వరి వంగడాలతో పాటు పలు నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. క్రిమిసంహారక మందుల సరైన వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలిచ్చారు. ప్రకృతి ఎన్విరాన్మెంట్ సొసైటీ (పీఈఎస్) ఎన్జీవో ప్రతినిధి శ్రీమతి జయశ్రీ, ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనివాస్ ప్రసాద్, ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్ సంస్థకు చెందిన ఇతర ప్రతినిధులు, సుమారు 200 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యవసాయం, డెయిరీ నుంచి మౌలిక వసతులు, అనుసంధానత వరకు అభివృద్ధిలో కీలక ఘట్టాలను చేరుకుంటున్న బనస్కాంత: పీఎం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31:గుజరాత్‌లోని బనస్కాంతలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ రూ.14,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, ప్రారంభించి, పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. నవరాత్రుల అనంతర పవిత్రమైన అమ్మవారి గడ్డపై ప్రసంగించిన ప్రధాన మంత్రి... మహిళలు, పిల్లలు, రైతులు, పశుపోషకుల కోసం పలు నూతన కార్యక్రమాలను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది సన్నకారు రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా నిధులను విడుదల చేశారు.

వికసిత్ భారత్‌కు రైతులు, అన్నదాతలు కీలక ఆధారమని ప్రధానమంత్రి అభివర్ణించారు. రైతుల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం నిరంతరం ప్రాధాన్యతనిస్తోందని, 2013-14తో పోలిస్తే జాతీయ వ్యవసాయ బడ్జెట్‌ను అయిదు రెట్లకు పైగా పెంచామని పేర్కొన్నారు. సన్నకారు రైతుల జీవితాల్లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి అంతర్భాగంగా మారిందన్నారు. గుజరాత్‌లో 50 లక్షలకు పైగా రైతులకు రూ. 1,000 కోట్లకుపైగా నిధులను జమ చేశామని, ఇందులో బనస్కాంతలోని లక్షలాది రైతు కుటుంబాలకు దాదాపు రూ. 50 కోట్లు అందినట్లు చెప్పారు. "నేడు దాదాపు 10 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ. 18 వేల కోట్లకు పైగా మొత్తం జమ అయ్యింది" అని పీఎం శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.గత కొన్నేళ్లుగా ప్రభుత్వ విధానాల ద్వారా రైతులకు రూ. 50 లక్షల కోట్లకుపైగా లబ్ధి చేకూరినట్లు, ఆదా అయినట్లు ప్రధానమంత్రి తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా సన్నకారు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా దాదాపు రూ. 4.5 లక్షల కోట్లు బదిలీ అయినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సన్నకారు రైతులే 85 శాతానికి పైగా ఉన్నారని, మా ప్రభుత్వం అలాంటి చిన్నరైతులను సంరక్షించి, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా అండగా నిలిచిందని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

కొన్నేళ్లుగా అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితుల మధ్య ఎరువుల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ, రైతులపై ఆ భారం పడకుండా ప్రభుత్వం వారిని కాపాడిందని ప్రధాన మంత్రి తెలిపారు. ''ఈ అంశంపై ప్రభుత్వం దాదాపు రూ. 16 లక్షల కోట్లు ఖర్చు చేసింది'' అని పీఎం శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

ఎంఎస్‌పీ హామీని ప్రభుత్వం పూర్తిగా నెరవేర్చిందని ప్రధాన మంత్రి గుర్తుచేశారు. "గత 12 ఏళ్లలో గోధుమ, వరి రైతులు ఎంఎస్‌పీ రూపంలో రూ. 24 లక్షల కోట్లకు పైగా అందుకున్నారు" అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు బలమైన భద్రతను కల్పించినట్లు ప్రధాన మంత్రి... మహిళలు, పిల్లలు, రైతులు, పశుపోషకుల కోసం పలు నూతన కార్యక్రమాలను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది సన్నకారు రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా నిధులను విడుదల చేశారు. తెలిపారు. గత 10 నుంచి 12 ఏళ్లలో పంటల బీమా నష్టపరిహారం ద్వారా రైతులు రూ. 2 లక్షల కోట్లకు పైగా అందుకున్నారని చెప్పారు. అదేవిధంగా పీఎం-కుసుమ్ పథకం ద్వారా సాగునీటి ఖర్చులను నిరంతరం తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా దాదాపు 12 లక్షల సోలార్ పంపులను పంపిణీ చేశామని, తద్వారా అదనపు విద్యుత్ ఉత్పత్తి కావటంతో పాటు, రైతులు 80 కోట్ల లీటర్లకుపైగా డీజిల్ కొనుగోలు చేసే ఖర్చు ఆదా అయిందని వివరించారు. ఈ అయిదు ప్రధాన పథకాలు, నిర్ణయాల వల్లే రూ. 50 లక్షల కోట్ల ఆర్థిక ప్రయోజనం, ఆదా జరిగిందన్నారు. "ఈ రూ. 50 లక్షల కోట్లు దేశంలోని రైతుల ఆదాయాన్ని పెంచటమే కాక, భారతదేశ వ్యవసాయ సామర్థ్యాన్ని బలోపేతం చేశాయి" అని పీఎం శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.వ్యవసాయం కేవలం సంప్రదాయమే కాక, భారతీయ సంస్కృతిలో కీలక భాగమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. గత 12 ఏళ్లలో వ్యవసాయం, పశుసంవర్ధక రంగంలో విజ్ఞాన శాస్త్రం సాంకేతికతను ప్రభుత్వం విస్తృతంగా అనుసంధానించిందని తెలిపారు. రైతులు పొలాలకు ఏ రకమైన ఎరువులు, ఎంత పరిమాణంలో అవసరమో మునుపటి ఇబ్బందులను మృత్తికా ఆరోగ్య కార్డు విజయవంతంగా పరిష్కరించిందని, ఇది దేశవ్యాప్తంగా వ్యవసాయ పద్ధతులను ఆధునీకరించిందని అన్నారు. "నేడు దేశంలోని రైతుల వద్ద 26 కోట్లకు పైగా మృత్తికా ఆరోగ్య కార్డులు ఉన్నాయి'' అని శ్రీ నరేంద్ర మోదీ చెప్పారు.

మారుతున్న వాతావరణ పరిస్థితులు రైతులకు సవాలుగా మారుతున్నాయని గుర్తిస్తూ, రైతులకు సూచన వాతావరణాన్ని తట్టుకునే విత్తన రకాలను అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రధాన మంత్రి తెలిపారు. ''ఇటీవల సంవత్సరాల్లో దాదాపు మూడు వేల నూతన రకాల విత్తనాలు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చాం'' అని పీఎం శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

గ్రామీణ మహిళల భాగస్వామ్యంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పశుసంవర్ధక రంగం అత్యంత కీలకమైన భాగమని ప్రధాన మంత్రి తెలిపారు. గత దశాబ్దకాలంలో డెయిరీ, పశుసంవర్ధక రంగంలో శాస్త్ర, సాంకేతికతను జోడించామని చెప్పారు. అత్యుత్తమ పశువుల జాతులు పాల ఉత్పత్తిని పెంచుతాయని, సకాలంలో టీకాలు, వైద్య చికిత్స వంటివి వ్యాధుల ద్వారా జరిగే నష్టాలను అరికడతాయని వివరించారు. ''పశువు ఆరోగ్యంగా ఉంటే, పశుపోషక సోదరీసోదరులకు ఆదాయం కూడా పెరుగుతుంది'' అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

స్వదేశీ పశువుల సంరక్షణ, శాస్త్రీయ పెంపకాన్ని ప్రోత్సహించటంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పాత్రను ప్రధానమంత్రి కొనియాడారు. బనస్కాంతలో నిర్మించిన పరిశోధనా కేంద్రం... గిర్, సాహివాల్, కాంక్రేజ్ వంటి స్వదేశీ ఆవుల జాతులతో పాటు మెహసానా, ముర్రా, జాఫరాబాది వంటి గేదె జాతులను సంరక్షించి, వాటి నాణ్యతను మెరుగుపరచటంలో ఈ మిషన్‌ను మరింత బలవరుస్తుందని, కాంక్రేజ్ జాతికి దేశంలోనే ఇది తొలి కేంద్రం అవుతుందని తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక పాల దిగుబడినిచ్చే, ఆరోగ్యకరమైన ఆవు లక్షణాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఐవీఎఫ్ ద్వారా భవిష్యత్ తరాలకు సులభంగా అందించవచ్చని అన్నారు. "దీని ద్వారా పశుపోషక రైతు నేరుగా ప్రయోజనం పొందుతాడు" అని పీఎం శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

గాలికుంటు వ్యాధి వంటి రుగ్మతల నుంచి పశువులను రక్షించటం ప్రాధాన్యత గల అంశమని ప్రధానమంత్రి అన్నారు. ఇటువంటి వ్యాధులు పశువుల ఆరోగ్యాన్ని, పాల ఉత్పత్తిని దెబ్బతీస్తాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా ఉచిత టీకా డ్రైవ్‌ను ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఇప్పటివరకు దాదాపు 150 కోట్ల వ్యాక్సిన్ డోసుల పంపిణీ జరిగిందని, 8 కోట్లకు పైగా రైతుల పశువులకు ఉచితంగా టీకాలు అందాయని తెలిపారు. ''ఇది పశుపోషక రైతులపై ఆర్థిక భారాన్ని కూడా తగ్గించింది'' అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

ఈ చర్యల ఫలితంగా డెయిరీ రంగంలో వచ్చిన మార్పులను వివరిస్తూ... 2013-14లో ఆవు, గేదె సగటు దైనందిన పాల ఉత్పత్తి 5 లీటర్ల లోపు ఉండగా, నేడు అది దాదాపు 8 లీటర్లకు పెరిగిందని ప్రధానమంత్రి తెలిపారు. దీనివల్ల ప్రపంచంలోనే అత్యంత వేగంగా పాల ఉత్పత్తిని సాధిస్తున్న దేశంగా భారత్ అవతరించి, గ్రామీణ రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందన్నారు. ''పాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో భారత్ ఉంది'' అని పీఎం శ్రీ నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు.

పశువుల పెంపకందారులు పాలతో పాటు ఆవు పేడ ద్వారా కూడా ఆదాయం పొందేలా సహకరించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. పేడ, వ్యవసాయ వ్యర్థాల నుంచి బయోగ్యాస్, బయో-సీఎన్‌జీ, సేంద్రియ ఎరువుల ఉత్పత్తికి అవసరమైన మౌలిక సదుపాయాలను బనాస్ డెయిరీ వంటి సంస్థల కీలక సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నేడు రెండు బయో-సీఎన్‌జీ కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. పశువుల ఆరోగ్యాన్ని కాపాడటం, పాల దిగుబడిని పెంచడం, పేడను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం తమ స్పష్టమైన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "మేం పశుపోషణను కేవలం ఒక సంప్రదాయంగా కాకుండా, రైతుల ఆదాయాన్ని పెంచి గ్రామాలను సుసంపన్నం చేసే శక్తిమంతమైన సాధనంగా తీర్చిదిద్దుతున్నాం" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధించేందుకు గత కొన్నేళ్లుగా ప్రభుత్వం సమగ్ర విధానంతో పనిచేస్తోందని ప్రధానమంత్రి వివరించారు. మత్స్య రంగం విస్తృతంగా అభివృద్ధి చెందడం, ఆ రంగంలో సహకార సంఘాలను ప్రోత్సహించడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. "భారత్ సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగాయని తెలిస్తే మీరు సంతోషిస్తారు" అని ప్రధానమంత్రి చెప్పారు.

రైతులకు అదనపు ఆదాయం సమకూర్చే మరో ప్రధాన మార్గంగా తేనెటీగల పెంపకాన్ని ప్రధాని శ్రీ మోదీ ప్రస్తావించారు. గత 12 ఏళ్లలో తేనె ఉత్పత్తి రెట్టింపైందని తెలిపారు. ఈ 'మధుక్రాంతి'ని ముందుకు తీసుకెళ్లడంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు పెరుగుతున్న భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. "సహజ తేనె ఎగుమతుల్లో మన దేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఎగుమతిదారుగా అవతరించిందని తెలిస్తే మీరు గర్వపడతారు" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

అధ్వానంగా మారిన రోడ్డు.. గ్రామస్తులు రాస్తారోకో

రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



కరీంనగర్, అక్టోబర్ 31: జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ జగదేవ్‌పేట గ్రామస్థులు ఆందోళనకు దిగారు. చర్లపల్లి నుంచి జగదేవ్‌పేట మీదుగా వెల్గటూర్ వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆరోపిస్తూ మండల కేంద్రంలో రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో కరీంనగర్, మంచిర్యాల వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి.

ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. రోడ్డుపై గుంతల కారణంగా విద్యార్థులు, గర్భిణులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రషర్ల నుంచి అధిక లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు.

పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు.తక్షణమే రోడ్డు పునర్నిర్మాణం చేపట్టకపోతే పాదయాత్ర నిర్వహిస్తామని హెచ్చరించారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ఉదయ్‌కుమార్ గ్రామస్థులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. అనంతరం గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

నిర్మాణ పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలి

విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి: కలెక్టర్ బి. సత్యప్రసాద్

కరీంనగర్, అక్టోబర్ 31: పాఠశాలల్లో చేపడుతున్న నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.

అలాగే ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహార భోజనం అందించాలని సూచించారు. శనివారం మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి జాప్యం లేకుండా నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అదనపు తరగతి గదులు, డార్మెటరీ నిర్మాణ పనులను పరిశీలించారు.

అనంతరం వంటగదిని తనిఖీ చేసి వంట సామగ్రి నాణ్యత, నిల్వ విధానాలు, పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ వారి చదువు, వసతులు, భోజన స

ప్రజల భద్రతకు భరోసా

నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యమే ధ్యేయం..
కమ్యూనిటీ కనెక్ట్‌తో ఆకస్మిక తనిఖీలు



ఖమ్మం, అక్టోబర్ 31: ప్రజల భద్రతకు భరోసా కల్పించడం, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఇటీవల టేకులపల్లిలోని కేసీఆర్ టవర్ ప్రాంతంలో కొందరు గంజాయి సేవిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఖమ్మం డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఏఆర్ ఫోర్స్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్, ఈగల్ ఫోర్స్, క్లూస్ టీమ్‌లకు చెందిన మొత్తం 286 మంది పోలీసు అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 52 బ్లూకుల్లోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. నకిలీ ధ్రువపత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 105 మంది వేలిముద్రలను సేకరించి పరిశీలించారు. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని, గంజాయి సేవిస్తున్న 12 మందిని, మగ్గురు చోరీ నిందితులను, ఇద్దరు అనుమానితులను గుర్తించడంతో పాటు 50 గ్రాముల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రాంతాన్ని నేరరహితంగా తీర్చిదిద్దేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు పోలీసు పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తామని, బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖతో మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత చెడు అలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కుటుంబం, పిల్లల భవిష్యత్తు కోసం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయదారుల సమాచారాన్ని పోలీసులకు అందించి గంజాయి రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వీయ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ నీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి ద్వారా అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, ప్రజలు స్థానికంగా ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఉండాలని సూచించారు. అక్రమ సంపాదనకు అలవాటుపడి మోసాలకు పాల్పడే వ్యక్తుల మాటలు నమ్మవద్దని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు అడిగే ఫోన్ కాల్స్, ఈ-మెయిల్స్‌కు స్పందించవద్దన్నారు. అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్లను అద్దెకు ఇచ్చే ముందు అద్దెకు తీసుకునే వారి చిరునామా, ఆధార్ వివరాలను పరిశీలించాలని సూచించారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలతో నేరస్తులను గుర్తించడంతో పాటు నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. పోలీసు పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్స్ సిబ్బంది నిరంతరం ఆయా ప్రాంతాల పరిస్థితులను పర్యవేక్షిస్తూ పాత నేరస్తుల వివరాలను సేకరిస్తారని చెప్పారు. ప్రజల్లో అభద్రతాభావం తొలగించేలా ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు రమణమూర్తి, ఎన్పీ ఏసీపీ మహేష్, సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీందర్, సీసీఎస్ ఏసీపీ సర్వర్, సీఐలు సాదిక్ పాషా, చిట్టిబాబు, కరుణాకర్, శివప్రసాద్, నాగరాజు, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్ పాల్గొన్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల సమర్థ వినియోగంపై హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి కార్యశాలను నిర్వహించనున్న డీజీఎఫ్‌టీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31: స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఈంబ) ద్వారా లభించే అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకునే అంశంపై విదేశీ వాణిజ్య సంచాలక జనరల్ (ఆఉఈబ) హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నవంబర్ 2, 2026న హైదరాబాద్‌లోని మాధాపూర్, టీ-హబ్ నాలెడ్జ్ సిటీలో రాష్ట్రస్థాయి కార్యశాలను నిర్వహించనుంది.

భారతదేశం కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై అవగాహన పెంపొందించడం, వాటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా వాణిజ్య వర్గాలను ప్రోత్సహించడం ఈ కార్యశాల ప్రధాన ఉద్దేశం. అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశాన్ని విస్తరించడం, ఎగుమతులకు సంబంధించి కొత్త అవకాశాలను గుర్తించడం, తెలంగాణ రాష్ట్ర ఎగుమతి పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేయడంపై ఈ కార్యక్రమం ప్రత్యేకంగా దృష్టి సారించనుంది.

మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ మెగా ఎఫ్‌టీఏ అవుట్‌రీచ్ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ప్రముఖ ఎగుమతిదారులు, జిల్లా పరిశ్రమల కేంద్రాల (ఆఎఐబ) అధికారులు, ఎగుమతి ప్రోత్సాహక మండళ్ల (ఇఖఅబ) ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు చెందిన ఇతర భాగస్వాములు సహా సుమారు 200 మంది పాల్గొననున్నారు.

ఈ కార్యక్రమంలో ఔషధాలు, ఇంజినీరింగ్, వస్త్ర పరిశ్రమలు, రత్నాలు, ఆభరణాలు వంటి కీలక ఎగుమతి ఆధారిత రంగాలపై ప్రత్యేక విభాగాల వారీ చర్చా సమావేశాలు నిర్వహించనున్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ, సముద్ర ఉత్పత్తులు, ఆహార శుద్ధి; వస్త్రాలు, దుస్తులు, వస్త్ర ఉత్పత్తులు; ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్లు; సేవల రంగాల్లో అందుబాటులో ఉన్న అవకాశాలు, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు చేపట్టాల్సిన ఆచరణాత్మక చర్యలపై కూడా చర్చించనున్నారు.

విధాన నిర్ణేతలు, పారిశ్రామిక ప్రతినిధులు, ఎగుమతిదారుల మధ్య ప్రత్యక్ష పరస్పర చర్చలకు ఈ సమావేశాలు వేదికగా నిలవనున్నాయి. ఆయా రంగాల్లోని నిర్దిష్ట అవకాశాలను గుర్తించడం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వినియోగంలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడం, ఎగుమతుల పనితీరును మెరుగుపరిచేందుకు ఆచరణాత్మక సూచనలు రూపొందించడం ఈ చర్చల ప్రధాన లక్ష్యం. ఈ అవుట్‌రీచ్ కార్యక్రమం ద్వారా భాగస్వామ్య వర్గాల్లో అవగాహనను పెంపొందించడం తో పాటు, భారతదేశం కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రోత్సహించడం, తెలంగాణ పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో మరింతగా అనుసంధానించడం డీజీఎఫ్‌టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా లభించే ప్రాధాన్యతాయుత మార్కెట్ ప్రవేశ సౌకర్యాలను, అభివృద్ధి చెందుతున్న వాణిజ్య అవకాశాలను వ్యాపార సంస్థలు సద్వినియోగం చేసుకునేలా చేయడం ద్వారా రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని భావిస్తున్నారు.

తరగతి గదిలో ఊడిపడిన సీలింగ్ పెచ్చులు..

ఇద్దరు విద్యార్థినులకు గాయాలు
బోనకల్ బాలికల వసతి గృహంలో ఘటన.. ఆరు గదుల్లో ప్రమాదకర పరిస్థితి



ఖమ్మం, అక్టోబర్ 31:ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో శనివారం ప్రమాదం చోటుచేసుకుంది. తరగతి గదిలో పాఠాలు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా సీలింగ్ పెచ్చులు ఊడిపడి ఇద్దరు విద్యార్థినులు గాయపడ్డారు. ఈ ఘటనతో మిగతా విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు.9వ తరగతి గదిలో ఉపాధ్యాయురాలు పాఠాలు చెబుతుండగా సీలింగ్ పెచ్చులు విద్యార్థినులపై పడ్డాయి. ఈ ప్రమాదంలో చేపలమడుగు పూజిత తలకు, అద్దంకి కీర్తన కాలికి గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. పూజితకు తలపై ఆరు కుట్లు, కీర్తనకు కాలిపై నాలుగు కుట్లు వేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

ఆరు గదుల్లో ప్రమాదకర పరిస్థితి

ఈ వసతి గృహంలో మొత్తం 579 మంది విద్యార్థినులు ఉంటున్నారు. హాస్టల్‌లోని ఆరు గదుల్లో గత మూడేళ్లుగా సీలింగ్ పెచ్చులు ఊడిపడుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. విద్యార్థినులు ఇదే గదుల్లో చదువుకోవడంతోపాటు రాత్రిపూట నిద్రిస్తుండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

మధ్యలోనే నిలిచిన మరమ్మతు పనులు

సీలింగ్ మరమ్మతులు, ఇతర చిన్నపాటి పనుల కోసం ఆరు నెలల క్రితమే నిధులు మంజూరైనట్లు సిబ్బంది తెలిపారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ డైనేజీ పనులను మాత్రమే 80 శాతం వరకు పూర్తి చేసి, మిగిలిన మరమ్మతులను మధ్యలోనే వదిలేసినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అక్టోబర్ 30న మిగిలిన పనులు పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. మరుసటి రోజే ఈ ప్రమాదం జరగడం గమనార్హం.

వసతి గృహం నిర్మించి కేవలం 13 ఏళ్ల మాత్రమే అవుతున్నా, సీలింగ్ పెచ్చులు ఊడిపడుతుండటంపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అన్ని గదులను పరిశీలించాలని, ప్రమాదకరంగా ఉన్న సీలింగ్‌లకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయడంతోపాటు భవన నిర్మాణ నాణ్యతపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి.. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు
పూర్తి సమాచారంతోనే సమావేశాలకు హాజరుకావాలి.. దిశా సమావేశంలో అధికారుల తీరుపై ఎంపీ ధర్మపురి అరవింద్ ఆగ్రహం



నిజామాబాద్, అక్టోబర్ 31:నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. పూర్తి సమాచారంతోనే సమావేశాలకు హాజరుకావాలని, అసంపూర్తి వివరాలతో సమాధానాలు చెప్పడంపై అధికారుల తీరును తప్పుబట్టారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ అధ్యక్షతన శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీఆర్వో గీత, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, మేయర్ ఉమారాణి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

యూజీడీ అభివృద్ధి పనులు ఎంతవరకు పూర్తయ్యాయని, పెండింగ్ పనుల పురోగతి ఏమిటని ఎంపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉండగా కొంత ఆలస్యమైందని అధికారులు వివరించారు. ఫిబ్రవరిలోగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. పనుల్లో మరింత జాప్యం జరగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ ఆదేశించారు. యూజీడీ పనుల్లో కొంత నాణ్యత లోపిస్తోందని, మూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు.

దిశా సమావేశంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఆర్‌అండ్‌బీతో పాటు వివిధ శాఖల అధికారులు అసంపూర్తి సమాచారంతో సమాధానాలు ఇవ్వడంపై ఎంపీ ధర్మపురి అరవింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి అభివృద్ధి పనికి సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేసుకొని సమావేశానికి రావాలని, పనుల పురోగతిపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు.

ఆర్మూర్‌లో ఇటీవల నిర్వహించిన రైతు వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యేగా తనను ఆహ్వానించలేదని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సమావేశంలో ప్రస్తావించారు. కనీన ప్రోటోకాల్ కూడా పాటించడం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ హాజరయ్యే అధికారిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఎందుకు ఆహ్వానించడం లేదని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

యాదాద్రి నరసింహుడిని దర్శించుకున్నగవర్నర్ దంపతులు

గవర్నర్‌కు ఘన స్వాగతం.. స్వామివారికి ప్రత్యేక పూజలు

నల్గొండ, అక్టోబర్ 31: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కొండపై ఉన్న అతిథి గృహం వద్ద గవర్నర్ దంపతులకు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవస్థానం ఈవో భవానీ శంకర్, కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, దేవస్థానం బోర్డు సభ్యుడు లక్ష్మీనారాయణ ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు. అనంతరం దేవస్థానం రూపొందించిన 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు.

గంగకత్వకు పూర్వ వైభవం తీసుకురావాలి

ఇరిగేషన్ అధికారులకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 31: (నేటినిజం ప్రతినిధి):గంగకత్వకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా ఆధునీకరణ పనులు చేపట్టాలని, రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పనులు పూర్తి చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కాంట్రాక్టర్లను దృష్టిలో పెట్టుకుని కాకుండా, రైతులకు మేలు జరిగేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

గంగకత్వ ఆధునీకరణ కోసం రూ.37 కోట్ల నిధులు తీసుకొచ్చి పనులు ప్రారంభించనున్న నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం జగ్గారెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, రైతులతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గంగకత్వ పరిధిలోని 11 గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరడమే లక్ష్యంగా పనులు చేపట్టాలన్నారు. ప్రాజెక్టు రూపకల్పనకు అనుగుణంగా మూడికతీత పనులు చేపట్టి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల నుంచి ఇంకా ఏవైనా విజ్ఞప్తులు వస్తే వాటిని పరిగణనలోకి తీసుకుని, అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. ఆధునీకరణ పనులన్నీ పూర్తయితే సుమారు 3,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని, గంగకత్వకు పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జగ్గారెడ్డి సూచించారు.

మంజీరా నదిలో తల్లి, ఇద్దరు కుమార్తెల మృతి..

మెదక్, అక్టోబర్ 31:మెదక్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. మంజీరా నదిలో తల్లి, ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. బుధవారం ఉదయం చిన్న ఘనపూర్ శివారులోని మొదటి బ్రిడ్జి సమీపంలో వారి మృతదేహాలను కొల్చారం పోలీసులు వెలికితీశారు. తల్లితో పాటు ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా కనిపించడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అభం శుభం తెలియని చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంతో స్థానికులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గంగోల్ల సరిత (27)కు వైష్ణవి (7), సాన్విక (6) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం



మహబూబ్‌నగర్, అక్టోబర్ 31: దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఊట్కూర్ ఉప సర్పంచ్ రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నాయకులు అన్నారు.

శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించారని కొనియాడారు. జయంతిని పురస్కరించుకొని ఆయన ధైర్యసాహసాలు, దృఢ సంకల్పం, దేశభక్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. దేశ ఐక్యతను కాపాడుతూ ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు హన్మంతు, కుంటిమారి భరత్, సర్దార్ యూత్ సభ్యులు నక్క విజయ్, చాకలి గోపాల్, శ్రావణ్, శాపల్లి రవి గొల్ల అనిల్, వి హెచ్ పి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనం, రెండుగ్లాసుల విధానం పాటిస్తే చర్యలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31: గ్రామాల్లో అంటరానితనం, రెండు గ్లాసుల విధానం పాటిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఊట్కూర్ తహసీల్దార్ అశోక్ కుమార్, ఎస్సై రమేష్ హెచ్చరించారు. శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులవివక్ష, అంటరానితనం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. గ్రామాల్లో ఎలాంటి వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వ భావనతో మెలగాలని సూచించారు. హోటళ్లు, టీ దుకాణాలు తదితర ప్రాంతాల్లో రెండు గ్లాసుల విధానాన్ని అమలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపినా, వారి పౌరహక్కులకు భంగం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెలంగాణ రచయితల సంఘం
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో..
పన్నెండేండ్ల సభలు
వర్తమాన సాహిత్యం - తెలంగాణ సంభాషణ
1 నవంబర్ 2026 ఆదివారం
ఉ॥ 10 గంటల నుంచి సా॥ 5 గంటల వరకు
వేదిక: రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్
ప్రారంభ సభ
సభాధ్యక్షులు: డా॥ నాళేశ్వరం శంకరం అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
కీలకోపన్యాసం: డా॥ కె. శ్రీనివాస్ సీనియర్ పాత్రికేయులు
అతిథులు: డా॥ నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత
దేశపతి శ్రీనివాస్ ఎమ్మెల్సీ
డా॥ ఏనుగు నరసింహారెడ్డి ఐ.ఏ.ఎస్. రైటెడ్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
జి. దేవీ ప్రసాద్ పూర్వ అధ్యక్షులు, టి.ఎస్.జి.ఓ.
విరాహత్ అలీ అధ్యక్షులు, టి.యు.డబ్ల్యు.జె.
బైస్ దేవదాస్ ఎడిటర్, నేటి నిజం
కార్యదర్శి నివేదిక: డా. వి. శంకర్ ప్రధాన కార్యదర్శి, తెరసం
భోజన విరామం
1.00 గం॥ల నుండి 2.00
మధ్యాహ్నం సదస్సు 2 గంటలకు
సభాధ్యక్షులు: డా. దెల్లంకొండ సంపత్ కుమార్ ప్రధాన కార్యదర్శి, తెరసం బంట నగరాలు
వక్తలు: ఎన్. వేణు గోపాల్ ఎడిటర్, వీక్షణం
ఆచార్య బన్న అయిలయ్య ప్రొఫెసర్ (ర), కాకతీయ విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథి: డా॥ నామోజు బాలాచారి కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
ఆప్తవాక్యం: కొండపల్లి నీహారిణి రచయిత్రి
కవి సమ్మేళనం సా॥ 4 గంటలకు
సభాధ్యక్షులు: రెండుమోరి శ్రీరాములు అధ్యక్షులు, తెరసం జంట నగరాలు
ఆత్మీయ అతిథులు: డా. తూర్పు మల్లారెడ్డి రచయిత, పలితోధకుడు
డా. వి. జయప్రకాశ్ తెలుగు భాషా చైతన్య సమితి
పాల్గొను కవులు
కందాళై రాఘవాచార్య, పాట్లపల్లి శ్రీనివాస రావు, శ్రీరామోజు హరగోపాల్, డా. చెమన్, దాసరాజు రామారావు, రూప్ కుమార్ డబ్బీకార్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, గద్దం సులోచన, మోతుకూరి అశోక్ కుమార్, పప్పుల రాజిరెడ్డి, సి.హెచ్. ప్రకాశ్, ఘనపురం దేవేందర్, సి.హెచ్. ఉషారాణి, వాసరచెట్ల జయంతి, ధూకపాల అరుణ, యరకల యాదయ్య, బిల్లా మహేందర్, దేవనపల్లి వీణావాణి, వాణి దేవులపల్లి, దాసరి మోహన్, ఎం. కవిత, ఎం.డి. అహ్మద్, ఎం. రాజశేఖర్, వేణుశ్రీ, గుండెల్లి జిస్తోరి, డా. పారెడ్డి రంగయ్య, కె. నవీన్ కుమార్, నరేశ్ చారి, డా. పాన్నాల బాలయ్య, గంభీరావుపేట యాదగిరి, డా. సిద్ధెంకి యాదగిరి, డా. తైదల అంజయ్య, డా. కాసర్ల నరేశ్ రావు, దొమ్మాట శంకర్ ప్రసాద్, కార్తీకరాజు, పానుగంటి రామమూర్తి, డా. జీడి రమేశ్, రుద్రంగి రమేశ్, సుప్పని సత్యనారాయణ, క్రాంతి కుమార్, నరాల సుధాకర్, నల్లగొండ రమేశ్, ఉప్పల పద్మ, గుత్త ప్రసాద్, గొర్రె అనిల్ కుమార్, పట్లోళ్ల బక్కారెడ్డి.
సాహితీ మిత్రులందరికీ సాదర ఆహ్వానం

తెలంగాణ ప్రజాసాహిత్య పితామహుడు వట్టికోట

తెలంగాణ ప్రజాసాహిత్య చరిత్రలో వట్టికోట ఆళ్వారుస్వామి ఒక మహోన్నత స్థానం పొందారు. ఆయన కేవలం రచయిత మాత్రమే కాకుండా ఉద్యమకర్త, కమ్యూనిస్టు నాయకుడు, ప్రచురణకర్త, పాత్రికేయుడిగా విభిన్న రంగాలలో సేవలందించారు. భాషా సాహిత్యం నుంచి పౌరహక్కుల ఉద్యమాల వరకు అనేక రంగాలలో ఆయన తన ప్రతిభను ప్రదర్శించారు. ఆయనకు "తెలంగాణ ప్రజాసాహిత్య పితామహుడు" అనే బిరుదు అందించారు.

బాల్యం మరియు ప్రారంభ జీవితం

1915 నవంబర్ 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని చెరువు మాదారం అనే గ్రామంలో జన్మించిన ఆళ్వారుస్వామి, చిన్నతనం నుండే సామాజిక అన్యాయాలను గమనించారు. ఈ అన్యాయాలు ఆయనలో చైతన్యాన్ని, మార్పు తపనను రేకెత్తించాయి. ఆయనకు సాహిత్యం పట్ల ఉన్న ఆసక్తిని "గ్రంథాలయోద్యమం" మరింత పెంచింది. నిజాం పాలనలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ దౌర్జన్యాలు ఆయనను రాజకీయాల వైపు నడిపించాయి.

వట్టికోట ఆళ్వారుస్వామి నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. పేద ప్రజల పట్ల అన్యాయం, వివక్షలపై ఆయన గళం ఎత్తారు. ఈ ఉద్యమంలో ఆయన అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారు. జైలు జీవితం ఆయన వ్యక్తిత్వం, సాహిత్యం పై విపరీతమైన ప్రభావం చూపింది. జైలులో ఉన్నప్పుడు ఆయన తన అనుభవాలను కథల రూపంలో అభివ్యక్తం చేయడం ప్రారంభించారు. "జైలు లోపల" అనే కథా సంపుటి ఆయన జైలు అనుభవాలకు ప్రతిబింబంగా నిలిచింది, ఇందులో జైలు లోపల నిర్బంధితుల జీవితం, వారి బాధలు

నవంబర్ 1...వట్టికోట ఆళ్వారుస్వామి జయంతి



వాస్తవానికి దగ్గరగా ఉంటాయి.

తెలుగులో రాజకీయ నవలలను రచించిన మొట్ట మొదటి వ్యక్తిగా వట్టికోట ఆళ్వారు స్వామి ప్రసిద్ధి చెందారు. ఆయన "ప్రజల మనిషి" అనే నవల రచించి తెలంగాణ ప్రజల జీవన పరిస్థితులను, సామాజిక అన్యాయాలను, ప్రజల మానసిక స్థితిగతులను ప్రతిబింబించారు. ఈ నవల అనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులపై తీవ్ర విమర్శగా నిలిచింది. వట్టికోట రచనల్లోని కథలు, నాటికలు సమాజాన్ని విమర్శిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసే లక్ష్యంతో ఉన్నవి. సురవరం ప్రతాప రెడ్డి హైదరాబాద్ లో స్థాపించిన "గోలకొండ" పత్రిక లో ప్రూఫ్ రీడర్ గా పని చేసారు. వట్టికోట ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, ప్రజా స్వేచ్ఛను కాపాడటానికి కృషి చేశారు. సమాజంలో న్యాయం, సమానత్వం రావాలనే ఆశయంతో ఆయన అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వట్టికోట ప్రజాసాహిత్య చైతన్యానికి ఒక బలమైన పునాదిగా నిలిచారు. ప్రజల జీవన గాధలను సాహిత్యంలోకి తీసుకురావడం ద్వారా సామాజిక మార్పు తపనను ప్రేరేపించారు.

తెలంగాణా లో స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణా రచయితల సంఘం వంటి సామాజిక, రాజకీయ సాహిత్య సంస్థలలో కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశారు. హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, 1944లో గుమాస్తాలు సంఘం, రిక్షాకార్మిక సంఘం, రైల్వే ఉద్యోగులు, కార్మిక ఉద్యోగుల సంఘాలకు నాయకత్వం వహించారు. దాశరధి వట్టికోట కలసి 1948 లో మూడు నెలలు నిజామాబాద్ జైలులో ఉన్నారు. దాశరథి పద్యాలు జైలు గోడల మీద రాసి దెబ్బలు తిన్నారు.


వట్టికోట ఆళ్వారుస్వామి కేవలం ఒక రచయిత మాత్రమే కాకుండా సమాజ సేవకుడు, ఉద్యమకర్త, ప్రజల చైతన్య దాత అని చెప్పవచ్చు. ఆయన రచనలు ప్రజల బాధలను, వారి ఆశయాలను ప్రతిబింబిస్తూ, ప్రజాస్వామ్య పునాదుల స్థాపనకు తోడ్పడతాయి. ఆయన సాహిత్యం తెలంగాణ ప్రజాసాహిత్యంలో ఒక అద్భుతమైన అధ్యాయంగా నిలిచిపోతుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

హామీల అమలులో హ్యాండ్సప్.. పాలనలో పూర్తిగా ఫెయిల్!

కాంగ్రెస్ పాలనలో ప్రగతిశీల తెలంగాణ తిరోగమనం
ఎన్నికలంటేనే ప్రభుత్వానికి వణుకు.. స్థానిక సంస్థల ఎన్నికలకు వెనుకడుగు
కరువు కట్టడిలో చేతులెత్తేసిన సర్కార్.. రైతులను నట్టేట ముంచింది
సింగరేణి కార్మికుల నుంచి నిరుద్యోగుల వరకు అందరిదీ అదే ఆవేదన
బీఆర్ఎస్‌లోకి యువత చేరిక.. కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



వరంగల్, అక్టోబర్ 31: అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చేతులెత్తేసిందని భూపాలవల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీలు, వంద రోజుల్లో హామీల అమలు అంటూ ప్రజలకు నమ్మబలికి అధికార పీఠాన్ని అధిష్ఠించిన కాంగ్రెస్.. రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. శనివారం భూపాలపల్లిలోని పార్టీ కార్యాలయంలో 16, 28వ వార్డులకు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇన్‌చార్జి రామస్వామి నాయక్ సమక్షంలో గండ్ర వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గండ్ర మాట్లాడుతూ.. అభివృద్ధిలో ముందున్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం తిరోగమనంలోకి నెట్టిందని ఆరోపించారు. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై రాజకీయ కక్షసాధింపులకు దిగుతోందని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, పాలనలోని వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులపై కేసులు, ఆరోపణలు, వేధింపులు చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించలేరన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని ముందుగానే హెచ్చరికలు వచ్చినా ప్రభుత్వం ఎందుకు అప్రమత్తం కాలేదని గండ్ర ప్రశ్నించారు. పక్కనే గోదావరి నది ప్రవహిస్తున్నా సాగునీటిని వినియోగించుకోలేని దుస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. రిజర్వాయర్లకు నీటిని తరలించి ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రాజెక్టులను నిరుపయోగంగా చూపించే ప్రయత్నంలో భాగంగానే నీటి వినియోగంపై నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. ఇల్లు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా కరువు పరిస్థితులు ఏర్పడిన తర్వాత అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తే ప్రయోజనమేమిటని ప్రశ్నించారు. తాగునీరు, పశుగ్రాసం, ఆహార ధాన్యాల కొరతపై ముందస్తు కార్యాచరణ రూపొందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలు ఉండగా, కేవలం టేకుమట్ల మండలాన్నే కరువు మండలంగా ప్రకటించడంపై గండ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కరువు మండలాల ఎంపికలో రాజకీయ ప్రమేయం ఉందని ఆరోపించారు. మంత్రులు ప్రాతినిధ్యం వహించే ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ మిగతా ప్రాంతాలను విస్మరించారని విమర్శించారు. రైతుల కష్టాలను రాజకీయ కోణంలో చూడకుండా అర్హత ఉన్న అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సింగరేణి కార్మికుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని గండ్ర విమర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల మెడికల్ బోర్డు వ్యవహారాల్లో న్యాయం జరగడం లేదని, అనర్హత సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. లాభాల పంపిణీ నుంచి ఉద్యోగ భద్రత వరకు కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.

స్థానిక సంస్థల పాలకవర్గాల పదవీకాలం ముగిసి రెండేళ్లు దాటుతున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంపై గండ్ర ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలను సకాలంలో నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజల తీర్పును ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతోనే ఎన్నికల నిర్వహణలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర సమస్యలను పక్కనపెట్టి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు.

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని గండ్ర కోరారు. నవంబర్ 6వ తేదీ గడువు ఉన్నందున విద్యార్హత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఎన్నికల ద్వారా ప్రజలకు ఉంటుందన్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు, ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనార్దన్, ఫ్లోర్ లీడర్ గండ్ర హరీష్ రెడ్డి, నరేందర్, జ్యోతుల మంజుల, మోతే రాజు, బొంతల సతీష్, మహిళా అధ్యక్షురాలు తిరుపతమ్మ, వేకల నంవత్, సిద్ధు, నమ్మయ్య, దేవరకొండ మధు, మాడ హరిరెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

16, 28వ వార్డుల యువకులకు కండువాలు కప్పిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి టౌన్, ఆంధ్రప్రభ : భూపాలపల్లి మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీకి యువత మద్దతు పెరుగుతోంది. పట్టణంలోని 16వ వార్డు కౌన్సిలర్ మంజుల, 28వ వార్డు కౌన్సిలర్ భోగం నరేందర్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువకులు నేడు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై నమ్మకంతో యువకులు పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. యువతకు పార్టీలో సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన యువకులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ మంజుల, 28వ వార్డు కౌన్సిలర్ భోగం నరేందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా దివంగత ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి

వరంగల్, అక్టోబర్ 31: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరవనిత, సంక్షోభాలను సవాళ్లుగా స్వీకరించిన ఉక్కు మహిళ దివంగత ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా మహనీయురాలికి శనివారం కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు.

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బత్తిని సహదేవు, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు, పట్టణ అధ్యక్షులు జానకి రాములు, పాశం సత్తిరెడ్డి, పాలకూర్ల వెంకటేశం, కాసుల వెంకన్న, కొండూరు సాయి,చిలుగురి సత్తిరెడ్డి ఎమ్మే లింగస్వామి, మైసోల్ల ప్రవీణ్,ఎండి కుర్షిత్, తిరుపతయ్య, దండు మల్లికార్జున్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తైక్వాండోలో వర్కుటపల్లి వాసికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్

గ్రాండ్ మాస్టర్ గుర్రం కృష్ణకు ప్రశంసా పత్రం, మెడల్ ప్రదానం

నల్గొండ, లఅక్టోబర్ 31: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కుటపల్లికి చెందిన గ్రాండ్ మాస్టర్ గుర్రం కృష్ణ తైక్వాండో విభాగంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన భారీ తైక్వాండో శిక్షణ కార్యక్రమంలో పాల్గొని తన ప్రతిభతో ఈ ఘనత సాధించారు.

2026 ఆగస్టు 9న హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'లార్జెస్ట్ తైక్వాండో లెసన్' అధికారిక గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో 533 మంది క్రీడాకారులు ఏకకాలంలో పాల్గొన్నారు. పూమ్సే, క్యూరీగి, పంచెస్, బ్లాక్స్, కిక్స్, సెల్ఫ్ డిఫెన్స్ విన్యాసాలను ప్రదర్శించి రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమంలో గుర్రం కృష్ణతో పాటు తూర్పునూరి మల్లేశం, గుర్రం ధనమ్మ కూడా గిన్నిస్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 30న హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రికార్డు సాధించిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. గుర్రం కృష్ణతో పాటు ఇతర రికార్డు విజేతలను రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు గ్రాండ్ మాస్టర్ ఎం. జయంత్ రెడ్డి, మహేశ్వర్, వహీజ్ అలీ ఖాన్, మారుతి, నరసింహా, హనుమంతు, శివప్రసాద్, భరత్ కుమార్ తదితరులు అభినందించారు.

కరీంనగర్‌లో ఘనంగా ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలు

కరీంనగర్, అక్టోబర్ 31: (నేటినిజం ప్రతినిధి) భారతరత్న, స్వతంత్ర భారతదేశ తొలి హోంశాఖ మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలు కరీంనగర్ నగరంలో ఘనంగా నిర్వహించారు. శనివారం చైతన్యపురిలోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి, తెలంగాణ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం 560కి పైగా స్వదేశీ సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి అఖండ భారతదేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహోన్నత నాయకుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు ఆయన చేపట్టిన 'ఆపరేషన్ పోలో' ద్వారా తెలంగాణ ప్రాంతానికి నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించిందని పేర్కొన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన కృషి, ధైర్యసాహసాలు, దూరదృష్టి భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గుజరాత్‌లోని నర్మదా నది తీరాన 182 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహమైన 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ'ని నిర్మించడం ఆయనకు దేశం అందించిన ఘనమైన నివాళి అని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ఆయన పేరుతో విద్యాసంస్థలు, వైద్య సంస్థలు, సేవా సంస్థలు ఏర్పాటు కావడం ఆయన ఆశయాలకు, దేశానికి చేసిన సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూ రికార్డుల అవకతవకలపై తహసీల్దార్ సస్పెన్షన్

అయ్యవారిపల్లి భూముల వ్యవహారంలో విచారణ నివేదిక ఆధారంగా కలెక్టర్ చర్యలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31: భూ రికార్డుల నమోదులో అవకతవకలు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంపై వచ్చిన విచారణ నివేదిక ఆధారంగా ఉప్పునుంతల తహసీల్దార్ ఎ. సునీతను జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ హేమంత కేశవ్ పాటిల్ సస్పెండ్ చేశారు.

ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అచ్చంపేట డివిజన్‌లోని అయ్యవారిపల్లి గ్రామ సర్వే నంబర్ 115లో భూమి రికార్డులు అక్రమంగా ఇతరుల పేర్లపై నమోదయ్యాయన్న వార్తల నేపథ్యంలో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాను విచారణ అధికారిగా నియమించగా, ఆమె సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించారు.పాత పహాణీలు, ఖాస్రా, ఆర్ఓఆర్ రికార్డులు, భూ భారతి పోర్టల్ దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. సర్వే నంబర్ 115లో మొత్తం 18 ఎకరాల 17 గుంటల భూమి ఉన్నట్లు పాత రికార్డుల్లో గుర్తించారు. అయితే కొత్త రెవెన్యూ రికార్డుల్లో 13 ఎకరాల 17 గుంటలు 115/ంలో ద్యాప రామిరెడ్డి పేరుపై, మరో ఐదు ఎకరాలు 115/ంలో పి. యాదమ్మ పేరుపై నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. కొన్ని భూ నమోదులు అసలు రెవెన్యూ రికార్డులతో సరిపోలడం లేదని, పత్రాల ధ్రువీకరణలో లోపాలు ఉన్నట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారు.

కవిత ఆరోపణలపై మాజీ మంత్రి జోగు రామన్న ఖండన

ప్రాజెక్టుల వ్యయంపై వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి..
రాజకీయ లబ్ధి కోసమే అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శ



ఆదిలాబాద్, అక్టోబర్ 31:ఇంద్రవెల్లి బహిరంగ సభలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలను మాజీ మంత్రి జోగు రామన్న తీవ్రంగా ఖండించారు. శనివారం మధ్యాహ్నం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్, టీఆర్ఎస్ నేతలను లక్ష్యంగా చేసుకొని రాజకీయ లబ్ధి కోసం అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో చనాకా-కొరాట ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1,770 కోట్లు ఖర్చు కాగా, రూ.1,700 కోట్లు అవినీతికి పాల్పడినట్లు కవిత ఆరోపించడం సరికాదన్నారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం, పెరిగిన అంచనాలు, సంబంధిత జీవోలను పరిశీలించి వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు. కేసీఆర్ పాలనలో ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం రూ.5 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌లో మూతపడిన సిమెంట్ పరిశ్రమను తిరిగి ప్రారంభించాలని కోరుతూ బీఆర్ఎస్ మంత్రుల బృందం పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసిందని జోగు రామన్న తెలిపారు. సీసీఐ ఫ్యాక్టరీ మూసివేతకు బీఆర్ఎస్‌కు సంబంధం లేదని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీల నిర్లక్ష్యం వల్లే పరిశ్రమ మూతపడిందని విమర్శించారు. ఇంద్రవెల్లిలో కవిత ప్రసంగం చూస్తుంటే కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కైనట్లు స్పష్టమవుతోందని ఆరోపించారు. బీజేపీని గెలిపిస్తే సిమెంట్ పరిశ్రమను పునరుద్ధరిస్తామని కేంద్ర మంత్రులు అమిత్ షా, హంసరాజ్ గంగారాం ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆదివారం ఆదిలాబాద్‌లో జరిగే రైతు గర్జన సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని, ఈ సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మండల వైస్ ప్రెసిడెంట్ గంగారెడ్డితో పాటు కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులు జోగు రామన్న సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరి గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు యానం సర్సింగరావు, లింగారెడ్డి, గోవర్ధన్, విజ్జగిరి నారాయణ, సాజిద్ ఉద్దీన్, ప్రహ్లాద్, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాదులోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు

నేషనల్ యూనిటీ డేసందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు



రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 31: (నేటినిజం ప్రతినిధి): వేములవాడలోని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు హైదరాబాదులోని రాష్ట్రపతినిలయాన్నిసందర్శించారు ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలయంలోని పలు విభాగాలను సందర్శించి అక్కడ జరిగే ప్రభుత్వ కార్యకలాపా లను అవగాహన చేసుకున్నారు అనంతరం నేషనల్ యూనిటీ డే సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా ర్యాలీగా వెళ్లి వన్ ఇండియా వన్ నేషన్ అంటూ నినాదాలు చేస్తూ భారతదేశం ఐక్యతకు నిలయం అని చాటి చెప్పారు అనంతరం నేషనల్ యూనిటీ మీద జరిగిన ఉపన్యాస పోటీలలో కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ ను చాటారు. అనంతరం నేషనల్ యూనిటీ మీద జరిగిన చిత్రలేఖన పోటీలలో పాల్గొన్నారు.

తదనంతరం రాష్ట్రపతి నిలయం గురించి ఉపాధ్యాయులు అక్కడి సిబ్బంది విద్యార్థులకు అర్థం చేయించారు. విద్యార్థులలో జ్ఞానం పెంచడానికి ఈ ఎడ్యుకేషనల్ టూర్స్ అవసరమవుతాయని వీటి వలన పిల్లలలో జ్ఞానం పెరుగుతుందని కరస్పాండెంట్ నరాల దేవేందర్ అన్నారు

విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండడానికి ఈ కార్యక్రమాలు తోడ్పడతాయని ప్రిన్సిపల్ దరక్షన్ వస్పియా అన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana. 'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.